Rni Title Code No. TELTEL02115

### దిల్లీలో 4 శాతానికి సమీపించిన పాజిటివిటీ రేటు..!

దిల్లీ: దేశంలో ప్రస్తుతం కరోనా వ్యాప్తి అదుపులోనే ఉంది. మరోరోజు వెయ్యికి సమీపంలోనే కొత్త కేసులు వచ్చాయి. అయితే దిల్లీలో మాత్రం మరోదఫా వైరస్ విజృంభిస్తోన్న సూచనలు కనిపిస్తున్నాయి. హోం ఐసోలేషన్‌లో ఉండేవారి సంఖ్య పెరుగుతోంది. అలాగే పాజిటివిటీ రేటు నాలుగు శాతానికి సమీపించడం ఆందోళన కలిగిస్తోంది. శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. నిన్న 3 లక్షల మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 975 మందికి పాజిటివ్‌గా తేలింది. అందులో ఒక్క దిల్లీ నుంచి వచ్చిన కేసులే 366గా ఉన్నాయి. అక్కడ పాజిటివిటీ రేటు 3.95 శాతానికి చేరింది. ఫిబ్రవరి 3 తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ 4.30 కోట్ల మందికి కరోనా సోకింది.

# గరుడ వార్త

**తెలుగు దినపత్రిక**

### పాక్‌లో చమురు మంటలు.. శ్రీలంక బాటలో పెట్రో ధరలు

ఇస్లామాబాద్: క్షీణించిన ఆర్థికవ్యవస్థతో సతమతమవుతున్న పాకిస్థాన్ ప్రజలపై ఇప్పుడు మరింత భారం పడే అవకాశం ఉంది. దేశ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆయిల్ అండ్ గ్యాస్ రెగ్యులేటరీ అథారిటీ (ఓజీఆర్ఏ) సూచనల మేరకు షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఇంధన ధరలను భారీగా పెంచాలని చూస్తోంది. శనివారం నుంచే కొత్త ధరలు అమలులోకి వస్తాయని, లీటరు పెట్రోలుపై రూ.83.5, డీజిలుపై రూ.119 పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఇతర చమురు ఉత్పత్తుల ధరలు సైతం భారీగా పెరగనున్నాయి. లైట్ డీజిలుపైన రూ.77.31, కిరోసిన్‌పైన రూ.36.5 మేర పెంచాలని పాక్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ ధరలు అమలైతే పాక్ ప్రజలకు ఇంధనం మరింత భారంగా మారుతుంది.

సంపుటి : 1 సంచిక : 69 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 ఏప్రిల్ 2023 శనివారం పేజీలు : 4

# గరుడ వార్త ఇప్పుడు మరింత చేరువగా...

## ఆన్లైన్ న్యూస్ పోర్టల్ ద్వారా గరుడ వార్త ఎప్పుడైన, ఎక్కడైన...



### ప్రముఖ హైకోర్ట్ న్యాయవాది రాపోలు భాస్కర్ చేతులమీదుగా ప్రారంభం...

### ప్రజల సమస్యలను ప్రపంచానికి ప్రతిబింబించేలా ఉండాలి : ప్రముఖ హైకోర్ట్ న్యాయవాది రాపోలు భాస్కర్

గరుడ వార్త తెలుగు దినపత్రిక ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఆన్లైన్ న్యూస్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గరుడ వార్త ఆన్లైన్ న్యూస్ పోర్టల్ ను హైకోర్టు ప్రముఖ న్యాయవాది సామాజికవేత్త రాపోలు భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వార్తాపత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమాజ శ్రేయస్సుకు దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను ప్రపంచానికి ప్రతిబింబించేలా ఉండాలన్నారు. తన 25 సంవత్సరాల సుదీర్ఘ న్యాయవాద సేవలో వార్త పత్రికలు, టీవీ ఛానళ్లు వాస్తవాలను వెలుగులోకి తెస్తూ, ఎందరినో ఆదుకున్నాయని గుర్తు చేశారు. దేశంలోనే యువ ఎంపీపీగా ఎన్నికైన వారిలో ముందుండే తాను, యువ ఎంపీపీగా ఎన్నికవ్వడానికి, అదేవిదంగా రెండు సార్లు ఎంపీపీగా ఎన్నికవడానికి వార్తాపత్రికలు పాత్ర కూడా కీలకమని, అందుకు ముఖ్య కారణం తాను యువకుడిగా ఉన్నప్పటి నుండి ప్రజలకు చేస్తున్న సేవలను ప్రతిరోజు గుర్తించి వార్తలు రాయడం ద్వారా తాను మరింత ప్రజలకు చేరువై మరెన్నో సేవలు చేయగలిగానని హైకోర్టు ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. గరుడ వార్త ప్రజల ఇబ్బందులు, అవసరాలను ప్రపంచానికి వార్తల ద్వారా ప్రతిబింబిస్తూ ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. garudavarthanews.in తోపాటుగా garudavarthanews.com ఆన్లైన్ ద్వారా ఎప్పుడైన, ఎక్కడైన గరుడవార్త పొందవొచ్చు.






### అర్వింద్‌పై రైతుల కన్నెర్ర.. వినూత్న రీతిలో ఫ్లెక్సీలు

నిజామాబాద్ : ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు తీసుకురాకపోవడంపై రైతులు కన్నెర్ర చేశారు. దీంతో వినూత్న ఫ్లెక్సీలకు తెరదీశారు. ఇటీవలి కాలంలో ఫ్లెక్సీ వార్ సర్వసాధారణమై పోయింది. కానీ అర్వింద్‌కు వ్యతిరేకంగా వెలిసినవి మాత్రం కాస్త వినూత్నంగా ఉన్నాయి. ఈ మేరకు నిజామాబాద్ వ్యాప్తంగా ఫ్లెక్సీలు వెలిశాయి. 'పసుపు బోర్డు... ఇది మా ఎంపీగారు తెచ్చిన పసుపు బోర్డు' అని కాస్త వెటకారాన్ని యాడ్ చేసి మరీ నిజామాబాద్ అంతటా రైతులు ఫ్లెక్సీలను అంటించారు. ఖాళీగా ఉన్న పసుపు బోర్డుపై ఇదే మా ఎంపీ తెచ్చిన పసుపు బోర్డు అని రాసి నిరసన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో అయిదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని వాగ్దానం చేసి ఎంపీ అరవింద్ బాండ్ పేపర్ రాసిచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో నిజామాబాద్‌కి వచ్చిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ , రామ్ మాధవ్‌లు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని చెప్పి ఓట్లు వేయించుకున్న అర్వింద్ తమను మోసం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కేసీఆర్ సెంటిమెంటు రాజకీయం చేస్తున్నారా ?



హైదరాబాద్ : పార్టీ లేదా ప్రభుత్వం ఎప్పుడు కష్టాల్లో ఉన్నట్లు అనిపించినా కేసీయార్ వెంటనే సెంటిమెంటు రాజకీయాలు మొదలుపెడతారు. గడచిన తొమ్మిదేళ్ళలో ఈ విషయం అనేకసార్లు రుజువైంది. ఇపుడు జరుగుతున్న గోల కూడా అలాగే అనిపిస్తోంది. తొందరలోనే సాధారణ ఎన్నికలు రాబోతున్నాయి. షెడ్యూల్ ఎన్నికలు డిసెంబర్లో జరగాలి. ప్రభుత్వంతో పాటు పార్టీపైన జనాల్లో బాగా వ్యతిరేకత పెరిగిపోతోందని సర్వేలు చెబుతున్నాయి. అలాగే చాలామంది ఎంఎల్ఏలపైన వ్యక్తిగతంగా పెద్దఎత్తున అవినీతి ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితిల్లో వచ్చేఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కష్టమనే అనుకుంటున్నారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే రెండు అంశాలు తెరపైకి వచ్చాయి. మొదటిదేమో బీఆర్ఎస్ ఎంఎల్ఏలను కొనేందుకు బీజేపీ పావులు కదుపుతోందనేది. బీఆర్ఎస్ ఎంఎల్ఏలను కొనేసి తన ప్రభుత్వాన్ని కూల్చేసేందుకు బీజేపీ కుట్రచేస్తోందని కేసీయార్ కొద్దిరోజులు గోలగోల చేశారు. అయితే దాన్ని జనాలు ఎవరూ పట్టించుకోలేదు. ఎందుకంటే కేసీయార్ కూడా కాంగ్రెస్ టీడీపీ ఎంఎల్ఏలను ప్రలోభాలు పెట్టి లాంగదీసుకున్న విషయం జనాలందరికీ గుర్తుంది. కాబట్టే కేసీయార్ ఎంత ప్రయత్నించినా ప్రభుత్వాన్ని కూల్చుటమనే సెంటిమెంట్ రాజుకోలేదు. సరిగ్గా ఈ సమయంలోనే ఢిల్లీ లిక్కర్ స్కామ్ బయటపడింది. తీగలాగితే డొంక కదిలినట్లు అది వచ్చి వచ్చి చివరకు కేసీయార్ కూతురు కల్వకుంట్ల కవిత దగ్గర ఆగింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో సౌత్ గ్రూపులో కవితే సూత్రదారని ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అనుమానించి విచారణకు నోటీసులిచ్చింది. ఇక్కడే కేసీయార్ సెంటిమెంట్ డ్రామా మొదలుపెట్టారు.

ఈడీ మహిళలను వేధిస్తోందని సెంటిమెంటు మొదలుపెట్టారు. దర్యాప్తుసంస్థలను అడ్డంపెట్టుకుని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాల నేతలను విచారణ పేరుతో ఇబ్బందులు పెడుతోందంటు కేసీయార్ గోల చేస్తున్నారు. లిక్కర్ స్కామ్ లో తనను అన్యాయంగా ఇరికించారని కవిత కూడా ఆరోపణలు మొదలుపెట్టారు.

నిజంగానే కవితకు ఇందులో ప్రమేయం లేకపోతే విచారణకు ఎందుకు భయపడుతున్నారు. తాజాగా కవిత తాను మహిళను ఈడీ ఆఫీసులో విచారణకు హాజరుకాలేనని మహిళలకు ప్రత్యేక హక్కులున్నాయంటు గోల చేస్తున్నారు. ఈ గోల వెనుక బీజేపీ మహిళలను వేధిస్తోందనే సెంటిమెంటును రాజేయటమే అనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. చివరకు ఏమవుతుందో చూడాల్సిందే.

న్యూఢిల్లీ : సామాన్యుడి నడ్డివిరుస్తూ రాకెట్ వేగంతో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సిలిండర్ ధరలను పెంచుతున్న కేంద్రప్రభుత్వం అరుదైన రికార్డును సొంతం చేసుకొన్నది. ప్రపంచంలో మరే ఇతర దేశంలో లేని విధంగా అత్యధిక ఇంధన ధరలు ఒక్క భారత్‌లోనే ఉండేలా సెట్ చేసింది. అవును. ఎల్పీజీ ధర ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత్ తొలిస్థానంలో ఉండగా, పెట్రోల్ రేటులో మూడోస్థానం, డీజిల్ ధరల్లో ఎనిమిదో స్థానంలో ఉన్నది. కొనుగోలు శక్తి తుల్యత (పర్చేజింగ్ పవర్ పారిటీ-పీపీపీ) గణాంకాలతో ఈ విషయాలు వెలుగుచూశాయి.

**ఏమిటీ పీపీపీ? :** వేరువేరు దేశాల ఆర్థిక వ్యవస్థని పోల్చి చూడడానికి ఆర్థిక వ్యవస్థ పరిమాణం, తలసరి ఆదాయం లాంటి అంశాలు మాత్రమే సరిపోవు. అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయాలు రూ. 40 లక్షల రూపాయల స్థాయిలో ఉంటే, భారత దేశ తలసరి ఆదాయం లక్ష దగ్గరే ఉంటుంది. దీన్ని మాత్రమే ఆధారంగా తీసుకుంటే, అమెరికా తలసరి జీవన ప్రమాణాల స్థాయికీ, భారత జీవన ప్రమాణాల స్థాయికి 40 రెట్లు వ్యత్యాసం ఉండాలి. కానీ, అలా ఉండదు. కాబట్టి దాన్ని ఇంకా మెరుగ్గా అంచనా వెయ్యడానికి తీసుకొచ్చిన పరామితినే ఈ పర్చేజింగ్ పవర్ పారిటీ (పీపీపీ). భారత్‌లో కిలో ఆలుగడ్డలు రూ. 21. అమెరికాలో కిలో ఆలుగడ్డల రేటు 1.94 డాలర్లు (రూ. 147). అంటే కిలో ఆలుగడ్డలను కొనుగోలు చేయాలంటే భారత పౌరుడితో పోలిస్తే ఒక అమెరికన్ ఏడు రెట్లు వెచ్చించాలి. భారత్‌లో ఒకపూట భోజనం చేయడానికి రూ. 70 సరిపోతుంది. అమెరికాలో అదే స్థాయి భోజనానికి వాళ్లు 10 డా లర్లు (రూ.758) ఖర్చు చేయాల్సి ఉంటుంది. అ ప్పుడు భారత్‌లో పూటకి రూ. 70 కొనుగోలు స్థాయి, అమెరికాలో రూ. 758 కొనుగోలు స్థాయికి సమానంఅన్నట్టు పరిగణించాలి. ఇదే పీపీపీ భావన. అమెరికన్ డాలరుకు భారత కరెన్సీ మారకం విలువ ప్రస్తుతం రూ. 75.86గా ఉన్నది. అయితే, అంతర్జాతీయ ద్రవ్యనిధి గణాంకాల ప్రకారం.. పీపీపీ ఆధారంగా అంతర్జాతీయ డాలర్‌తో పోలిస్తే భారత కరెన్సీ విలువను ప్రస్తుతం రూ.22.6గా నిర్ణయించారు. అంటే 22.6 రూపాయలు.. ఒక పీపీపీ డాలర్‌కు సమానమని గ్రహించాలి. పీపీపీ డాలర్ రేట్లను ఆధారంగా చేసుకొని వివిధ దేశాల్లో ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ రేట్లను నిపుణులు గణించారు.

**భగ్గుభగ్గు :** ఎల్పీజీ సిలిండర్ ధర ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో భారత్ తొలిస్థానంలో ఉన్నది. లీటర్ ఎల్పీజీకి మనం 3.5 పీపీపీ డాలర్లను చెల్లిస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. అయితే లీటర్ ఎల్పీజీకి బ్రిటన్‌వాసులు ఒక్క పీపీపీ డాలర్ మాత్రమే చెల్లిస్తుండటం గమనార్హం. పెట్రోల్ రేట్లు ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడోస్థానంలో ఉన్నది. ఇరాన్ పౌరుడు తన రోజూవారీ జీతంలో పెట్రోల్‌కు 0.1 శాతాన్ని ఖర్చు చేస్తుండగా, భారతీయుడు రోజూవారీ జీతంలో 23.5% పెట్రోల్ కోసం వెచ్చిస్తున్నాడు. డీజిల్ రేట్లు ఎక్కువగా ఉన్న దేశాల్లో మ నం 8వ స్థానంలో ఉన్నాం. భారతీయుడు రోజూవారీ జీతంలో 29.9%డీజిల్ కోసం ఖర్చుచేస్తున్నాడు.

**పెండ్లి కానుకగా పెట్రోల్ :** కొత్తగా పెండ్లైన జంటకు వారి స్నేహితులు లీటర్ పెట్రోల్, డీజిల్‌ను బహుమతిగా ఇచ్చారు. ఈ విచిత్ర ఘటన తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా చెయ్యూర్ గ్రామంలో ఇటీవల చోటుచేసుకొన్నది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కంటే ఖరీదైన వస్తువు తమకు కనిపించలేదని, అందుకే తమ మిత్రుడి పెండ్లికి పెట్రోల్ బాటిల్‌ను బహుమతిగా ఇచ్చామని వరుడు గ్రేస్ కుమార్ మిత్రులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.



## ధరల మోతలో భారత్ నం.1

### ప్రపంచంలో ఎల్పీజీ రేటు మనదగ్గరే ఎక్కువ- పెట్రోల్ రేటులో మూడు, డీజిల్‌లో 8వ స్థానం

### దినసరి ఆదాయంలో 23% వాటా పెట్రోల్‌కే - ప్రజల కొనుగోలు శక్తి ఆధారంగా అంచనాలు

# 'బాదుడు'లోనూ మోదీకి లేదు పోటీ

# ఆయనకు ఆయనే సాటి

# సంపాదకీయం

## ఈ విషయాన్ని ఎలా మరుస్తారు మోడీ?

ఎప్పుడేం మాట్లాడాలో అది మాట్లాడితేనే బాగుంటుంది. అందుకు భిన్నంగా ఎజెండా పెట్టుకొని ప్రసంగాలు చేయటం.. అది కూడా రాజ్యసభలో.. ప్రధానమంత్రి హోదాలో ఉన్న ప్రముఖుడు అంటే ఇంకేం చెప్పాలి. తాజాగా కాంగ్రెస్ పార్టీని దారుణమైన విలన్ గా అభివర్ణిస్తూ ప్రధాని మోడీ చేసిన ప్రసంగం ఇప్పుడు పెనుసంచలనంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఎంత దారుణమైనది? మరెంత దుర్మార్గమైనది? ఆ పార్టీ కారణంగానే దేశంలో ప్రజాస్వామ్యం గొంతు నులిమిందన్న తీవ్ర వ్యాఖ్యలు ఇప్పుడే ఎందుకు? అన్నది ప్రశ్న. దీనికి సమాధానం సింపుల్ గా చెప్పేయొచ్చు. దేశంలో జరుగుతున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కారణంగా మోడీనోటి నుంచి వచ్చే మాటలు మారిపోవటమే కాదు.. కాంగ్రెస్ దేశానికి ఎంత నష్టం చేసిందన్న విషయాన్ని ఆయన అందరికి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. దేశానికి కాంగ్రెస్ నష్టమే చేసిందనే అనుకుందాం మోడీ చెప్పినట్లు. కానీ.. అందుకు తమ పార్టీ కూడా సాయం చేసిందన్న వైనాన్ని అస్సలు మర్చిపోకూడదు. ఆ మాటకు వస్తే.. కాంగ్రెస్ తప్పులే చేయకుంటే ఈ రోజున దేశానికి మోడీ అవసరం ఎందుకు వచ్చేది? ఆయన ఎందుకు ప్రధానమంత్రి అయ్యారు. కాంగ్రెస్ తప్పు చేసిందని దేశ ప్రజలు డిసైడ్ చేసి.. ఆ పార్టీని కాదని మోడీ సర్కారు చేతికి అధికారం ఇచ్చిన తర్వాత.. ఇప్పుడు పోస్టు మార్టం దేనికి? దేశంలో జరిగిన దారుణాలకు కాంగ్రెస్ పార్టీని బాధ్యుల్ని చేసే కన్నా.. అలాంటి పరిస్థితి అసలెందుకు వచ్చిందన్న విషయాన్ని వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా మాట్లాడే మోడీ విశ్లేషిస్తే బాగుండేది. కాంగ్రెస్ పార్టీకి చెందిన గులాంనబీ అజాద్ కు మొన్నటికి మొన్న పద్మభూషణ్ పురస్కారాన్ని ఇచ్చిన మోడీ ప్రభుత్వం చెప్పిందేమిటి? కాంగ్రెస్ పార్టీ చెడ్డది కాదు.. దాన్ని నడిపించిన కొందరు వ్యక్తులు మాత్రమే అనేగా? అలాంటప్పుడు పార్టీ మీద ఇంతటి ఘాటు వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఉందా? ఆ మాటకు వస్తే.. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు చేసిన తప్పులే.. వారికి ప్రత్యామ్నాయం కోసం దేశం వెతికే ప్రయత్నం చేయటం.. మోడీ చేతికి పగ్గాలు ఇవ్వటం చేసిందన్న విషయాన్ని మర్చిపోకూడదు. మిగిలిన సంగతులు ఎలా ఉన్నా.. తాను రెండు దఫాలు ప్రధాన మంత్రిని అయ్యానంటే అందుకు కారణమైన కాంగ్రెస్ కు మోడీ మాష్టారు ధన్యవాదాలు చెప్పాలి కదా? ఆ చిన్న లాజిక్ ను మర్చిపోయి.. కాంగ్రెస్ మీద అంతలా విరుచుకు పడటం ఏమాత్రం న్యాయం? కాంగ్రెస్ పార్టీ లేకున్నా.. ఆ పార్టీకి చెందిననేతలు పలువురు తప్పులు చేయకుంటే.. ఇవాళ మోడీ ఇలా మాట్లాడే అవకాశం ఉండేది కాదు కదా? అయినా.. ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ గుణగణాలు.. మంచి చెడ్డలు అధికారం చేతికి వచ్చిన ఎనిమిదేళ్లకు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఏముంది? చరిత్రను చెప్పటానికి.. చరిత్రలో జరిగిన తప్పుల్ని సరి చేసే అవకాశం.. అధికారం మోడీ చేతిలో ఉన్నప్పుడు.. దాన్ని మార్చకుండా మాటలకే పరిమితం కావటం ఏమిటి మోడీజీ?

# పాఠం చెప్పరు.. పరీక్ష రాయాల్సిందే..!



మంచిర్యాల :ఇంటర్‌లో పర్యావరణ విద్య, నైతిక మానవ విలువల పరీక్షలు అత్యంత కీలకం. వీటిలో ఉత్తీర్ణులైతేనే ఇంటర్ విద్య పూర్తయినట్టు లెక్కా. కాని వీటి నిర్వహణలో భిన్న పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్యాసంవత్సరమంతా చెప్పిన పాఠాలకు పరీక్షలు నిర్వహిస్తుంటే ఈ రెండు సబ్జెక్టుల్లో చెప్పని చదువుకు పరీక్షలు నిర్వహిస్తుండటం, వాటిపై విద్యార్థులకు అవగాహన లేకపోవడంతో నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ పరీక్ష రాయని విద్యార్థులు మిగతా అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులైనా ఫెయిల్ ఐనట్టే. వీరికి మెమో రాకపోవడం, ఉన్నత విద్యకు అవకాశం లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అవగాహన లేమితో ఈ తంటాలు వారికి తప్పడం లేదు. ధ్రువీకరణ పత్రాలు అందక విద్యాసంవత్సరం నష్టపోవాల్సి వస్తోంది. గతేడాది కరోనా నేపథ్యంలో పరీక్షల నిర్వహణ సాధ్యం కాకపోవడంతో అసైన్‌మెంట్ రూపంలో విద్యార్థులు ఇంటివద్దే పరీక్షలు రాసి కళాశాలల్లో సమాధాన పత్రాలు అప్పగించారు. 2021-22 విద్యాసంవత్సరానికి గానూ ఈ నెల 11న నైతిక- మానవవిలువలు, 12న పర్యావరణ విద్య పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో ఏటా సుమారుగా 10 శాతం మంది విద్యార్థులు ఈ పరీక్షలకు దూరంగా ఉంటున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాలలు 57 వరకు ఉన్నాయి. వీటిలో సుమారు 17 వేల మంది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. దేశ భవితకు కేంద్ర బిందువైన యువతలో విశ్వసనీయత నింపేందుకు పర్యావరణ విద్య నైతిక- మానవ విలువల సబ్జెక్టులను ప్రవేశపెట్టారు. జీవన నైపుణ్యంలో విద్యార్థి నడవడికపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని ప్రథమ సంవత్సరంలో ప్రవేశపెట్టింది. ఉద్దేశం మంచిదే అయినా.. ఆయా కళాశాలల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నీరుగారుతుండడంతో పాటు విద్యార్థులకు నష్టం వాటిల్లుతోంది. ఈ సబ్జెక్టులను విద్యార్థులకు బోధించకపోవడమే కాకుండా వాటి గురించి అవగాహన కల్పించకపోవడం దీనికి ముఖ్య కారణమవుతోంది. బోధనలు అందించాల్సి ఉన్నా.. దాదాపు అన్ని కళాశాలల్లో ఈ రెండు సబ్జెక్టుల పాఠాలు చెప్పడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. పరీక్షల సమయంలోనే ఈ సబ్జెక్టులు ఉన్నాయనే విషయం వారికి తెలుస్తోంది. దీంతో పరీక్షల్లో ఏమి రాయాలో తెలియక గైర్హాజరవుతున్నారు.పాస్ మార్క్ వస్తే చాలని, ఇంటర్ మార్కులకు వీటిని కలపక పోవడంతో ఈ సబ్జెక్టును కేవలం మొక్కుబడిగానే పరిగణిస్తున్నారు. ఈ పరీక్షలకు ఏ కళాశాలలో చదివే విద్యార్థులకు ఆదే కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిని ప్రాధాన్యం లేని పరీక్షలుగా పలు కళాశాలలు కొట్టిపారేస్తూ చూచిరాతలను ప్రోత్సహిస్తుండడం విశేషం.మెమోలు రావువిద్యార్థులు తప్పనిసరిగా రెండు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. వీటిలో ఉత్తీర్ణులైతేనే పాస్ మెమో బోర్డు అందిస్తుంది. పరీక్షకు హాజరుకాక అనుత్తీర్ణులైతే ఉన్నత విద్యకు అవకాశం ఉండదు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలి..- ఆర్.శైలజ, డీఐఈవో

# నిర్మించారు.. వదిలేశారు



బోథ్ : ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి భవనాలను నిర్మిస్తోంది. కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలకు వీలుగా ఉండేందుకు, పనులను తొందరగా ముగించుకునేందుకు ఆయా అధికారులకు గదులను కేటాయిస్తూ భవన నిర్మాణాలను చేపడుతుంది. జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన వివిధ శాఖల భవనాలు నిరుపయోగంగా మారాయి. మండలాల్లో అన్ని హంగులతో భవన నిర్మాణాలు పూర్తయినా ఉపయోగానికి నోచుకోవడం లేదు. దీంతో సదరు కార్యాలయ పరిసర ప్రాంతాలు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. కార్యాలయ గోడలపై మొక్కలు పెరుగుతున్నాయి. కొన్ని మండలాల్లో భవనాలు నిర్మించినా ఇంకా అద్దె భవనాలలో సిబ్బంది విధులు కొనసాగించటం కొసమెరుపు. రూ.కోట్లు వెచ్చించి భవనాలను నిర్మించి, మళ్లీ రూ.వేలల్లో అద్దె చెల్లించడం వెనుక మర్మమేమిటో తెలియని పరిస్థితి. అద్దె భవనాల్లో చాలీచాలని గదుల్లో అధికారులు విధులు నిర్వర్తిస్తున్నా, సొంత వాటిని ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల అసలు అధికారులే లేకపోయినా భవనాలను నిర్మించి వదిలేశారు. చిన్న పనులు పూర్తవ్వలేదనే కార్యాలయాలను ప్రారంభించటం లేదు. మద్యం బాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

విద్యుత్తు మీటరు బిగించలేక..బోథ్ మండల కేంద్రంలో రూ.55 లక్షలతో 2017లో నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నేటికీ ప్రారంభించలేదు. దీంతో ప్రస్తుతం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. అన్ని హంగులతో, పూర్తి సదుపాయాలతో నిర్మించి సంబంధిత గుత్తేదారు సంబంధిత శాఖ అధికారులకు భవనాన్ని గతంలోనే అప్పగించారు. నూతన కార్యాలయంలో విద్యుత్తు మీటరును అమర్చకపోవటంతో దాదాపు నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారింది. అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయాన్ని సొంత కార్యాలయంలోకి మార్చాలని లేదా శిథిలావస్థకు చేరిన మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సదరు భవనంలోకి మార్చాలని ఉద్యోగులు కోరుతున్నారు.ఇచ్చోడలోని ఐకేపీ కార్యాలయం నిర్మించి ఏళ్లు గడిచినా ఎవరూ పట్టించుకోక పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. ప్రస్తుతం ఐకేపీ కార్యాలయం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇరుకు గదులతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సమావేశాలను నిర్వహించుకోవటానికి సమావేశ మందిరం సైతం లేక మహిళలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

సిరికొండ మండల కేంద్రంలో కొన్నేళ్ల కిందట నిర్మించిన మండల విద్యావనరుల కేంద్రం ప్రారంభం కాలేదు. మండల విద్యాధికారి లేనప్పటికీ కార్యాలయం మాత్రం నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం సదరు భవనం పశువులు, మందుబాబులకు అడ్డాగా మారింది. మండలంలో తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాన్నయినా ఇక్కడికి మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

# ఊపిరితిత్తులపై నల్లమచ్చ

కొత్తగూడెం : సింగరేణి కార్మికుల్లో బ్లాక్‌లంగ్ వ్యాధి బయటపడటం ఆందోళన కలిగిస్తోంది.. బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణిలో గత ఐదేళ్లలో ఏడుగురు కార్మికులు న్యూమోకోనియోసిస్ వ్యాధి బారినపడ్డట్లు గుర్తించారు. బొగ్గు ధూళి కణాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లడం ద్వారా ఇది సంక్రమిస్తుంది. గనుల్లో ఉత్పత్తితో పాటు రవాణా, లోడింగ్ సమయంలో అధికంగా ధూళి కణాలు గాలిలో కలిసిపోతుంటాయి. అవి నాసిక రంధ్రాల ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరుకోవడంతో వ్యాధి సంక్రమించే ప్రమాదం ఎక్కువ. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది.సింగరేణిలో 42 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 30 వేల మంది కార్మికులు బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో పనిచేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో ఏడుగురు కార్మికులకు బ్లాక్‌లంగ్ వ్యాధి సోకినట్లు పార్లమెంటులో ఎంపీ ప్రమోద్‌కుమార్ ఝా మూడ్రోజుల కిందట ప్రస్తావించడంతో ఒక్కసారిగా ఇది వెలుగులోకి వచ్చింది. ఇటీవల కొత్తగా ఎక్కడా కేసులు నమోదు కాకపోవడం ఊరటనిచ్చే అంశం. వ్యాధి బాధితుల్లో ముగ్గురికి నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించారు. మరికొంత మందికి ఉపరితల విభాగాల్లో విధులు కల్పించారు.

అప్రమత్తతతోనే దూరం బొగ్గు ధూళి వెలువడే ప్రాంతంలో విధులు నిర్వహించే కార్మికులు విధిగా మాస్కు ధరించాలి.సింగరేణిలో 22 భూగర్భ, 20 ఉపరితల గనుల ద్వారా రోజుకు 2.5 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారు. బయటకు రవాణా చేయడంతో పాటు వినియోగదారులకు పంపే లారీలు, వ్యాగన్‌లలో నిరంతరం లోడింగ్ చేస్తుంటారు. బంకర్‌ల నుంచి లారీల్లో నింపే సమయంలో బొగ్గు ధూళి గాలిలో కలుస్తుంది. వీటిల్లో 5 మైక్రాన్‌ల కంటే తక్కువ స్థాయిలో ఉండే కణాలతోనే ప్రమాదం ఉంటుంది. వీటిని గాలిలో కలవకుండా చేసేందుకు పని ప్రాంతాలు, ప్రభావిత ప్రాంతాల రహదారులపై నిరంతరం నీళ్లు చల్లించాలి. పరిసర ప్రాంతాల్లో మొక్కలు పెంచడం ద్వారా ధూళి వ్యాప్తిని అడ్డుకోవచ్చు. సమస్యాత్మక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.వ్యాధి గుర్తించడం ఇలా..బాగా దగ్గు రావడంతో పాటు ఆయాసం వస్తుంది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉన్నా వైద్యులను సంప్రదించాలి. సాధారణంగా మొదలయ్యే దగ్గు రోజురోజుకు పెరుగుతుంది. న్యూమోకోనియోసిస్‌గా గుర్తిస్తే 6 నెలల వరకు ప్రత్యేక వైద్యం తీసుకోవాలి.

ఇటీవల కాలంలో కొత్తగా బ్లాక్‌లంగ్(న్యూమోకోనియోసిస్) కేసులు నమోదు కాలేదు. ఐదేళ్ల కాలంలో ఏడు కేసులు మాత్రమే నమోదయ్యాయి. గుర్తించిన రోగులకు వైద్యం అందించాం. న్యూమోకోనియోసిస్‌గా గుర్తించిన వారికి పరిహారం అందజేశాం. వ్యాధికారణంగా పెద్ద ప్రమాదమేమీ ఎదురుకాలేదు.

కాలుష్య ప్రభావిత ప్రాంతాలు ఉభయ జిల్లాల్లోని కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాల్లోని కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ల వద్ద ఎగిసే దుమ్ము, ధూళి కార్మికుల ఆర్యోగాల్ని దెబ్బతీసేలా ఉంటోంది. ఇల్లెందు జేకే ఓసీ, టేకులపల్లి కేవోసీ, మణుగూరులోని మరో మూడు ఓసీలు, కొత్తగూడెంలోని జీకే ఓసీ, సత్తుపల్లిలోని రెండు ఉపరితలగనుల్లో పేలుళ్లు నిర్వహించినప్పుడు బొగ్గు రేణువులు, దుమ్ము, ధూళి పైకెగిసి పడుతుంది. ఆ తర్వాత గనుల్లోకి వెళ్లేవారు, సమీప ప్రాంతాల వాసులు కాలుష్య సమస్య ఎదుర్కొంటున్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

సిద్దిపేట : నిర్మాణాలు చేపట్టే వారికి మున్సిపల్ ద్వారా పొందే అనుమతులు మరింత సులభతర మయ్యేందుకు ప్రభుత్వం టీఎసబీపాసను ప్రవేశపెట్టింది. ఈ పోర్టల్ ద్వారా నేరుగా సదరు యజమాని సంబంధిత డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేసిన 21 రోజుల్లోనే అనుమతులు పొందే అవకాశం కల్పించారు. దీని ద్వారా మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం కూడా లేకుండా పారదర్శకతకు పెద్దపీట వేశారు. అంతేగాకుండా 70 గజాల లోపు విస్తీర్ణం కలిగిన వారికి కేవలం ఒక్క రూపాయికే ఇంటి నిర్మాణ అనుమతులను అందజేస్తున్నారు. ఈ పథకంలో ఇచ్చిన అనుమతుల ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, ఎటువంటి అదనపు కట్టడాలు చేపట్టరాదని జీవోలో పేర్కొన్నారు. ప్రతీ భవనానికి కొన్ని షరతులతో కూడిన అనుమతులను ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తున్నారు. అనుమతికి మించి విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే టాస్క్‌ఫోర్స్ కమిటీ కూల్చివేతలు చేపట్టాలని చట్టంలో పేర్కొంది. ప్రజల వ్యయప్రయాసాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా అనుమతులను ప్రభుత్వం జారీ చేస్తుంటే నిర్మాణదారులు మాత్రం అడ్డదారుల్లో వెళ్తున్నారు. టీఎసబీపాస్ ద్వారా అనుమతులను పొందడం ఒక రకంగా అయితే నిర్మాణం చేసేది మాత్రం మరొక రకంగా చేపడుతున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్ర ప్రధాన రహదారికి ఆనుకుని నిర్మిస్తున్న భవనాలు అనుమతికి విరుద్ధంగా చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

సెట్‌బ్యాక్ నిబంధనలు ఇవే- 200 గజాల లోపు ఉంటే రోడ్డు వైపు 5 ఫీట్లు, మిగతా మూడు వైపులా 3, 5 ఫీట్లు వెనక్కి జరిగి స్లాబు వేసుకోవాలి.- 100 గజాల లోపు అయితే రోడ్డుకు 5 ఫీట్లు, మిగిలిన రెండు వైపులా 2 ఫీట్లు వదలాలి.- సెట్‌బ్యాక్ స్థలంలో స్లాబు, ప్రహరీ, సెప్టిక్ ట్యాంకు ఉండకూడదు.- భవన నిర్మాణ దరఖాస్తుకు ముందే 246 గజాలు దాటిన భవనానికి పది శాతం మార్టిగేట్ వర్తిస్తోంది. జీం2 దాటితే తప్పనిసరిగా చేయాలి అదనపు నిర్మాణాల కూల్చివేతమెదక్ మున్సిపల్ పరిధిలో టీఎసబీపాస్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై టాస్క్‌ఫోర్స్ కొరడా ఝుళిపిస్తోంది. ఫిబ్రవరి, మార్చిలో మూడు దఫాలుగా అక్రమ, అదనపు కట్టడాలను గుర్తించింది. టాస్క్‌ఫోర్స్ అధికార బృందం అయినటువంటి తహసీల్దార్, ఆర్అండ్‌బీ డీఈ, ఫైర్ ఆఫీసర్, పోలీస్ అధికారులు గుర్తించిన భవనాల కూల్చివేతలకు వెనుకాడటం లేదు. ఇప్పటి వరకు 14 భవనాల అదనపు నిర్మాణాలను కూల్చివేసిన టాస్క్‌ఫోర్స్, మరో 12 భవనాల అదనపు కట్టడాలను కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేసింది. త్వరలోనే వీటిని కూడా బృందం ఆధ్వర్యంలో కూల్చివేయబోతున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి తెలిపారు.నిర్లక్ష్యం.. అవగాహన లేమిటీఎసబీపాస్ ద్వారా నిర్మాణదారులకు అనుమతులు సులభతరంగా మారినప్పటికీ వారిలో మాత్రం నిర్లక్ష్యం తగ్గడం లేదు. మున్సిపల్ అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతూ టాస్క్‌ఫోర్స్ దృష్టిని ఆకర్షిస్తున్నారు. నూతన మున్సిపల్ చట్టం ప్రకారం అనుమతుల మేరకు కట్టడాలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. అవగాహన లేమితో ఇష్టానుసారంగా నిర్మాణాలను చేపడుతున్నారు. ఇలాంటి సమయంలో ఫిర్యాదులందుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం నిర్మించిన అదనపు కట్టడాలను కూల్చివేస్తుంది. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల అవగాహనలేమితో కొత్తకొత్త కట్టడాలు నేలకూలుతున్నాయి. దీంతో లక్షల రూపాయలు నిర్మాణదారులు నష్టపోవాల్సి వస్తోంది.

# మైనింగ్ కలకలం

వికారాబాద్ :యాచారం మండలంలోని అటవీ, గుట్టల ప్రాంతాల్లో మైనింగ్ ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలతో రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పొలాల మధ్య ఉన్న భూముల్లో క్రషర్లు ఏర్పాటు చేస్తే దుమ్ముధూళి, స్టోన్‌పౌడర్ పడి పంటలు పాడవు తాయని ఆందోళన చెందుతున్నారు. నీటి వనరులూ ఉనికిని కోల్పోతాయని.. తమ గ్రామాల పరిధిలో క్రషర్ల బిగింపునకు ఒప్పుకునే ప్రసక్తే లేదని యాచారం, నందివనపర్తి, మొండిగౌరెల్లి గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. యాచారం మం డలం మైనింగ్ జోన్ ఏర్పాటు కలకలం రేపుతోంది. హెచ్ఎండీఏ పరిధిలో మైనింగ్‌కు నిషేధం ఉన్నా వ్యాపారులు ఖాతరు చేయడం లేదు. యాచారం, నందివనపర్తి, మొండిగౌరెల్లి గ్రామాల్లో క్రషర్ మిషన్లు బిగింపునకు కొందరు వ్యాపారులు పావులు కదుపుతున్నారు. మైనింగ్‌జోన్ వద్దంటూ నాలుగున్నరేళ్లుగా మొండిగౌరెల్లి, యాచారం, నందివనపర్తి రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని క్రషర్లు బిగించేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. అదేజరిగితే చుట్టుపక్కల ప్రాంతాలు దుమ్ముధూళితో కాలుష్య కాసారమై పంటలు పండవని, ఇక్కడ నివాసయోగ్యంగా కూడా ఉండదని రైతులు హెచ్చరిస్తున్నారు. క్రషర్లు పెడితే వందల ఎకరాలు బీడుగా మారుతాయని అంటున్నారు.

అనుమతి లేకుండా రోడ్డు.. గట్టుచప్పుడు కాకుండా అనుమతులు!యాచారానికి రెండు కిలోమీటర్ల దూరంలో సర్వే 146లో రెవెన్యూ అనుమతి లేకుండానే క్రషర్ వ్యాపారులు కిలోమీటర్నర మట్టి రోడ్డును వేశారు. ప్రభుత్వ భూమిలో రోడ్డు వేసినా రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పట్టించుకోలేదు. యాచారం సర్వే నెంబర్ 121లో 39ఎకరాల్లో భారీ క్రషర్లు బిగింపునకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ ఒప్పందం చేసుకుందని తెలుస్తోంది. యాచారం సర్వే నెంబర్ 105, 121, 126, 132, 200లలో 618ఎకరాలను పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లా మైనింగ్ అధికారులను ఆదేశించింది. 142 నుంచి 144, 146, 149, 151 సర్వే నెంబర్లలో 2019 ఫిబ్రవరి 6 నుంచి 2024 ఫిబ్రవరి 14 వరకు క్వారీ లీజు మంజూరు చేస్తూ గనుల శాఖ 2020లో ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా యాచారంలోని 159, 191, 200, 192 సర్వే నెంబర్లలో క్రషర్ మిషన్లు బిగింపునకు అధికారులు దృష్టిసారించినట్లు తెలిసింది.పశువులు, వన్యప్రాణుల మనుగడ కష్టమే..మొండిగౌరెల్లిలో 19సర్వే నెంబర్‌లో 1,200ఎకరాల భూమి ఉంది. ఇందులో 300ఎకరాలను గతంలో పేదలకు అసైన్ చేశారు. ఈ భూముల్లో రైతులు బోర్లు వేసి కూరగాయ పంటలు సాగుచేస్తున్నారు. సర్వే నెంబర్ 19లోని గుట్టల్లో 2026 మే19 వరకు ప్రభుత్వం క్రషర్లకు లీజుకు ఇచ్చింది. ఇక్కడ క్రషర్లు బిగిస్తే రాతి పొడి పరుచుకొని యాచారం, గడ్డమల్లాయగూడ, మొండిగౌరెల్లి, గున్గల్ గ్రామాల్లో పంటలు పండకుండాపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లోని అడవుల్లో వన్యప్రాణులకూ మనుగడ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అడవులపై ఆధారపడి వ్యవసాయ అనుబంధంగా ఉన్న పశువులు, గొర్లు, మేకల, పెంపకం కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందని.. జీవాలకు మేత దొరకడం కష్టమవుతుందని స్థానికులు అంటున్నారు.క్రషర్లతో నీటి వనరుల ఉనికికీ దెబ్బ!నానక్‌నగర్, పిల్లిపల్లి గ్రామాల మధ్య నందివనపర్తి సర్వే నెంబర్ 581/20లో 329 ఎకరాలు ఉండగా దానిలో 17ఎకరాల 38గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో క్రషర్లు బిగింపునకు యత్నిస్తున్నారు. తాడిపర్తి, పిల్లిపల్లి, గొల్లగూడ, నానక్‌నగర్, బొల్లిగుట్టతండా, నందివనపర్తిల్లో పంట భూముల్లో స్టోన్ పౌడర్ పరుచుకొని పంటలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. నాలుగు చెరువుల అలుగులు, తూములు మూసుకుపోయి నీటి వనరులే లేకుండా పోయే పరిస్థితి వస్తుందనడంలో సందేహం లేదు. దీంతో మత్స్యకారులు సైతం ఉపాధి కోల్పోతారు. మొండిగౌరెల్లిలో క్రషర్లు వద్దుమొండిగౌరెల్లిలో క్రషర్లు పెట్టొద్దు. ఈ ప్రాంతంలో మైనింగ్ జోన్ వస్తే పంటలు పండక రైతులంతా వీధిన పడతారు.

# కిట్ సరే.. ప్రోత్సాహకమేదీ!

పెద్దపల్లి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం కేసీఆర్ కిట్ పేరిట ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తోంది. కడుపులో నలుసు పడినప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. నెలవారీగా సర్కారు దవాఖానాల్లోనే వైద్య పరీక్షలు చేసుకొని, కాన్పు అయ్యేవరకు సామగ్రితో కూడిన కిట్‌తో పాటు ఆడబిడ్డకు రూ.13 వేలు, మగబిడ్డకు రూ.12 వేల చొప్పున నగదు పంపిణీ చేస్తున్నారు.

2017 జూన్ 2న అమ్మఒడి పథకాన్ని ప్రారంభించగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందుబాటులోకి రావడంతో ఏటికేడు ప్రసవాలు పెరుగుతున్నాయి. కాగా కిట్ పంపిణీ చేస్తున్నా ప్రోత్సాహక నిధులు విడుదలకు నోచుకోవడం లేదు. ఫలితంగా బాధితులు నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. నగదు పంపిణీలో తమ ప్రమేయం లేదని, ప్రభుత్వమే నిధులు విడుదల చేయాల్సి ఉందని వైద్య శాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

నాలుగు దశల్లో..

గర్భం దాల్చిన మూడు నెలల్లోగా స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వ దవాఖానాకు వెళ్లి రెండు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలి. దీంతో అయిదు నెలల్లోపు రూ.3 వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. రెండో దశలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగితే కేసీఆర్ కిట్ అందించి మగ బిడ్డకు రూ.4 వేలు, ఆడబిడ్డకు రూ.5 వేల చొప్పున అందజేస్తారు. మూడో దశలో పుట్టిన పిల్లలకు 45 రోజుల్లోగా టీకా వేయించాలి. మూడున్నర నెలలకు మూడు సార్లు టీకా వేసుకుంటే రూ.2 వేలు, నాలుగో దశలో తొమ్మిది నెలలకు నిర్ణీత గడువులో టీకా వేసుకుంటే రూ.3 వేలు విడుదల చేస్తున్నారు.

అందుబాటులో లేని వివరాలు

పెద్దపల్లిలోని జిల్లా ప్రధానాసుపత్రి, గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ ఆసుపత్రులతో పాటు 18 గ్రామీణ, 6 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 104 ఉపకేంద్రాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ, శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక చొరవ చూపుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 11,933 మంది గర్భిణులు పథకం కింద నమోదు చేసుకున్నారు. వీరికి నెలల తరబడి నగదు సాయం పంపిణీ చేయడం లేదు. ప్రోత్సాహకాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుండటంతో వైద్య శాఖ అధికారుల వద్ద వివరాలు ఉండటం లేదు.

రెండేళ్లుగా ఎదురుచూస్తున్నా

గర్భం దాల్చినప్పటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు చేయించుకున్నా. 2021 మే నెలలో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరగడంతో అక్కడే కేసీఆర్ కిట్ ఇచ్చారు. అప్పటి నుంచి నగదు కోసం ఎదురుచూస్తున్నా.

సరిత, చిన్నఓదాల, మంథని మండలం

నగదు సాయం అందలేదు

సుల్తానాబాద్ ఆసుపత్రిలో పేరు నమోదు చేసుకున్నా. వైద్య సిబ్బందికి బ్యాంకు ఖాతా, ఇతర ఆధార పత్రాలు అందజేశాను. ఇక్కడే మగబిడ్డకు జన్మనిచ్చాను. కిట్ మాత్రమే ఇచ్చారు. మూడు నెలలు దాటినా ఇప్పటివరకు పైసా ప్రోత్సాహకం అందలేదు. సుకన్య, సుల్తానాబాద్

# నూలు బ్యాంకు ఏర్పాటయ్యేనా?

సిరిసిల్ల : రాష్ట్రంలో మరమగ్గాల వస్త్రోత్పత్తిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడ 30,352 మరమగ్గాలపై రోజుకు సగటున మూడు లక్షల మీటర్ల వస్త్రోత్పత్తి జరుగుతోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 16 వేల మంది ఉపాధి పొందుతున్నారు. దక్షిణభారత దేశంలో అత్యధికంగా పాలిస్టర్ నూలు వాడేది జిల్లాలోనే. ప్రభుత్వం సంక్షేమ శాఖల ఆర్డర్లలో ఏటా సుమారు తొమ్మిది కోట్ల మీటర్ల వస్త్రం ఉంటుంది. దీని విలువ రూ.600 కోట్ల పైనే ఉంది. వీటితోపాటు ఇతర ప్రైవేటు ఆర్డర్లు కూడా ఉంటాయి. మొత్తం జిల్లాలో 90 శాతం పాలిస్టర్ వస్త్రోత్పత్తులే ఉన్నాయి. అయితే ఇక్కడ నూలు విక్రయశాలలు గానీ, ప్రభుత్వ నూలు బ్యాంకు గానీ లేదు. దీంతో చిన్న, మధ్య తరగతి వస్త్రోత్పత్తిదారులు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి. దీంతో ప్రభుత్వ ఆర్డర్లలో ఉపాధి వరకు ఫర్వాలేదు కానీ శ్రమకు తగ్గ ప్రతిఫలం లభించడం లేదు. ఫలితంగా చాలా మంది తమ పరిశ్రమల్లోనే రోజు వారీ కూలీలుగా మారుతున్నారు. ఇది పరిశ్రమ మనుగడపైన తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఏటా 30 వేల టన్నులు అవసరం

రాష్ట్రంలో పాలిస్టర్ నూలు తయారీ పరిశ్రమలు లేవు. పూర్తిగా మహారాష్ట్ర, గుజరాత్‌ల నుంచి దిగుమతి అవుతుంది. వీటికి హైదరాబాద్‌లో ఏజెన్సీలు ఉన్నాయి. అక్కడి నుంచి జిల్లాకు వచ్చే ఆర్డర్లను బట్టి మధ్యవర్తులు తెప్పిస్తుంటారు. వీటినే పరిశ్రమ వర్గాలకు విక్రయిస్తారు. ఇలా ముగ్గురి చేతులు మారాక రవాణా ఛార్జీలతో కలిపి క్వింటాల్‌కు సగటున రూ.10 వరకు అదనపు భారమవుతోంది. అదీ కాక పెట్రో రసాయనాలతో తయారు చేసే పాలిస్టర్ నూలు ముడి చమురు ధరలపై ఆధారపడి ఉంటుంది. అంతర్జాతీయంగా వీటి దిగుమతి ధరల ఆధారంగా నూలులో హెచ్చు తగ్గులు ఉంటాయి. ప్రభుత్వ ఆర్డర్లలో వందశాతం పాలిస్టర్ నూలును వినియోగిస్తారు. ఏకరూప దుస్తులు, సంక్షేమశాఖ, రంజాన్, క్రిస్మస్, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలతోపాటు ఇతర ప్రైవేటు ఆర్డర్లకు కలిపి ఏటా సుమారు 30 వేల టన్నులు వినియోగిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితి ఇలా...

ప్రభుత్వం ఆర్డర్లు పంపిణీ చేసే నాటికి, ఉత్పత్తి ప్రారంభించే సమయానికి నూలు ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. దీని ప్రభావం పెట్టుబడులపై చూపుతోంది. ఆర్డర్లలో పేర్కొన్నట్లుగా నూలు, ఇతర ముడి సరకులు కొనుగోలు చేయాలి. మూడంచెల్లో వ్యవస్థలోని జిల్లా వస్త్ర పరిశ్రమలో యజమానులకు ఇబ్బందులు లేవు. ఆసాములు, కార్మికులకే పెట్టుబడులకు కష్టం. ముందుగా ముడి సరకుకు పెట్టుబడి కావాలి. ఉత్పత్తి పూర్తయ్యే వరకు ప్రతి వారం కార్మికులకు వేతనాలు చెల్లించాలి. వస్త్రం అప్పగించాక నెలల తరబడి ప్రభుత్వ బిల్లుల కోసం వేచిచూడాలి. దీంతో పెట్టుబడికి తీసుకున్న అప్పునకు ఇక్కడ వడ్డీ పెరుగుతుంది. చివరికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినా అవి పెట్టుబడి, అప్పు చెల్లించాక ఒక్కోసారి కూలి ఖర్చులు కూడా మిగలని పరిస్థితి. ప్రభుత్వం వందల కోట్ల విలువైన ఆర్డర్లు ఇస్తున్నా పరిశ్రమ విస్తరణకు నోచుకోవడం లేదు. నూలు బ్యాంకు ఏర్పాటు చేస్తే పెట్టుబడికి అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండదు. కష్టానికి తగిన ప్రతిఫలం ఉంటుంది.

ఇలా చేస్తే మేలు..తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో మరమగ్గాల వస్త్రోత్పత్తి సమూహాలున్న చోట నూలు కంపెనీల విక్రయశాలలున్నాయి. వాటిలో మధ్యదళారుల వ్యవస్థ ఉండదు. దీంతో కొనుగోలు, ఉత్పత్తి, విక్రయాలకు మరొకరిపై ఆధారపడాల్సిన అవసరం లేదు. తమ వద్ద ఉన్న డబ్బుతో నూలు కొనుగోలు చేసి.. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్త్రాన్ని ఉత్పత్తి చేసి పెట్టుబడికి తగిన ప్రతిఫలం పొందే వీలుంది.

జిల్లాలోనూ విక్రయశాలలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ ఆర్డర్లకు సరిపడా నూలును మధ్య దళారీ వ్యవస్థ లేకుండా కొనుగోలు చేయొచ్చు. ఆర్డర్ల మేరకు మ్యాక్స్ (మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ)లు, ఎస్‌ఎస్ఐ యూనిట్లకు ప్రభుత్వ ఆర్డర్లతో బ్యాంకుల్లో స్వల్ప కాలిక రుణాలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.ప్రభుత్వమే నూలు బ్యాంకు ఏర్పాటు చేస్తే మ్యాక్స్ సంఘాలు, ఎస్‌ఎస్ఐ యూనిట్లు ఇక్కడే నేరుగా నూలు తీసుకుని ఉత్పత్తులను ఇక్కడే అప్పగిస్తాయి. ప్రభుత్వ చెల్లింపుల్లో నూలు ధర పోను మిగతావి చెల్లిస్తే సరిపోతుంది.

# ఆహార ఉత్పత్తుల తయారీలో చేయూత



కరీంనగర్ : మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడి ఉన్న చోటనే ఆదాయం అర్జించేందుకు కేంద్ర ప్రభుత్వం వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో వివిధ రకాల వస్తువుల తయారీపై దృష్టిపెట్టిన అధికారులు ప్రస్తుత మార్కెట్‌లో ఆహార పదార్థాలకు మంచి డిమాండ్ ఉండడంతో ఆ దిశగా చర్యలు తీసుకుంటుంది. రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు 35 శాతం రాయితీతో మగువలకు రుణం అందజేస్తోంది. నిబంధనలు లేకుండా కేవలం వారి వ్యక్తిగత వివరాలు సరిగా ఉండే రుణం మంజూరు చేసేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేవలం ఒకటి, రెండు మూడు కాకుండా మొత్తం 36 రకాల చిరువ్యాపారాలను పొందుపరిచారు. జిల్లాలోని మహిళలు సమీపంలోని గ్రామ, మండల సమాఖ్య లేదా డీఆర్డీఏ అధికారులకు తమ వ్యక్తిగత వివరాలను అందిస్తే సరిపోతుంది.

మూడేళ్ల కాలపరిమితి

ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళలు 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులు. వారు ఏ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు ఇవ్వాల్సిన పనిలేదు. గ్రామంలోని డీఆర్డీఏకు చెందిన వీవో, మండల సమాఖ్య, ఏపీఎంలకు ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, చరవాణి నంబర్ ఇస్తే బ్యాంకు వారు వ్యక్తిగత వివరాలు సరిగా ఉంటే తక్షణమే రుణం మంజూరు చేస్తారు. మూడేళ్ల కాలపరిమితితో రుణం ముగుస్తుంది.

రాయితీ ఎంతంటే

పీఎంఎఫ్ఎంఈ (ప్రైమ్ మినిస్టర్ ఫార్ములేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్) పథకంలో భాగంగా మొత్తం 36 రకాల ఆహార ఉత్పత్తులు తయారీ చేయొచ్చు. బేకరీ, పిండి, చపాతీ, చిప్స్, గానుగ నూనె, సీతాఫలంతో పదార్థాలు, పప్పులు, ఎండు చేపలు ప్యాకింగ్, పల్లినూనె, నెయ్యి, పండ్ల రసం, తేనే, జొన్నపిండి, ఇవే కాకుండా మరిన్ని జాబితాలో ఉన్నాయి. ఇందుకు సంబంధించిన యంత్రాల కొనుగోలుకు, అవసరమైన సామగ్రికి రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణం 35 శాతం రాయితీతో ఇస్తున్నారు. లబ్ధిదారుల వాటా పది శాతం మాత్రమే. గ్రామీణ మహిళలు ఈ పథకంతో ఎవరి సహాయం లేకుండా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు.

ప్రాజెక్టు రిపోర్టుకు అధికారులు సహకరిస్తారు

మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ప్రాజెక్టు రిపోర్టుకు డీఆర్డీఏ అధికారులు సహకరిస్తారు. ఏమైన ఇబ్బందులుంటే నేరుగా జిల్లా అధికారులను కలవాలి. శ్రీలత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# మిగిలింది వారమే



మల్యాల : తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయంలో వచ్చే నెల 6న హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. అనధికారికంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో దాదాపు 2 లక్షలకుపైగా దీక్షాపరులు తరలివచ్చి మాలవిరమణ చేసి స్వామివారిని దర్శించుకుని వెళ్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈనెల 4 నుంచి 7 వరకు ఆలయ అధికారులు ఆర్జిత సేవలను నిలిపివేయనున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఊసేలేని సమావేశంఏటా కొండగట్టులో నిర్వహించే హనుమాన్ చిన్న, పెద్ద జయంతి ఉత్సవాలకు కనీసం 20 రోజుల ముందుగా జిల్లా పాలనాధికారి లేదా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తారు. ఉత్సవాల్లో చేపట్టాల్సిన పనులు, బాధ్యతల గురించి ఆయా శాఖల సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తారు. ముఖ్యంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా క్యూలైను ఏర్పాటు, తొక్కిసలాట జరగకుండా పోలీసు బందోబస్తు, తాగునీరు, పుణ్యస్నానాల కోసం చేయాల్సిన నీటి సరఫరా, సంపూర్ణ పారిశుద్ధ్యం, ప్రత్యేక క్యూలైను నిర్మాణం, అంతరాయం లేని విద్యుత్తు సరఫరా గురించి చర్చించాల్సి ఉంటుంది. అత్యవసర సమయంలో భక్తులకు వైద్య చికిత్సలకు ఆరోగ్య ఉపకేంద్రం, అగ్నిప్రమాదాల నివారణకు యంత్రాల ఏర్పాటు గురించి అధికారులకు తగు సూచనలు జారీ చేయాల్సి ఉంటుంది కానీ.. ఇంకా ఉత్సవాల సమన్వయ సమావేశం నిర్వహించకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సవాల ఏర్పాట్లకు రూ.62.50 లక్షలు

కొండగట్టులో ఏప్రిల్ 6న నిర్వహించనున్న హనుమాన్ చిన్న జయంతి, మే నెలలో నిర్వహించనున్న హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాల్లో ఏర్పాట్లు చేయడానికి ఆలయ అధికారులు రూ.62.50 లక్షల నిధులు వెచ్చించడానికి దేవాదాయశాఖ కమిషనరుకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే దాదాపు రూ.12.50 లక్షలతో ఆలయ పరిసరాల్లో తడికల పందిళ్లు వేయించడంతోపాటు రెండు జయంతి ఉత్సవాల్లో ఆలయానికి, పరిసరాల్లో విద్యుత్తు దీపాలంకరణ కోసం రూ.19 లక్షలు, విద్యుత్ సామగ్రి కొనుగోలు కోసం రూ.7 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఏటా తడికల పందిళ్లు, ఇతర పనుల కోసం అత్యధిక నిధులు ఖర్చు చేయడంపట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయ పరిసరాల్లో తడికల పందిళ్ల నిర్మాణం చేపట్టారు.

# సమగ్ర వికాసమే లక్ష్యం

కరీంనగర్ : చిన్నారుల్లో పోషకాహార లోపం శారీరక వికాసానికి శాపంగా మారింది. బరువు తక్కువగా ఉండటం, ఎదుగుదల సరిగ్గా లేకపోవడం, రక్తహీనతతో పాటు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో పోషకాహార లోపాలు గుర్తించి నివారణ చర్యలు చేపట్టేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్డులు ప్రవేశపెట్టారు.పుట్టినప్పటి నుంచి అయిదేళ్ల వరకు పిల్లల పెరుగుదలకు సంబంధించి బరువు, పొడవు, ఎత్తు, జబ్బ చుట్టుకొలత, వయసుకు తగ్గ బరువు, ఎత్తుకు తగ్గ బరువు వంటి అంశాలను బాల, బాలికలకు వేర్వేరుగా ప్రతి నెలా నమోదు చేస్తున్నారు. అయితే పేద కుటుంబాలకు పోషకాహారం క్రమ పద్ధతిలో అందడం లేదన్న విమర్శలున్నాయి. ప్రతి సంవత్సరం నిర్వహించే 'పోషణ్ పక్వాడా' కార్యక్రమంలో పోషకాహార లోపాలపై అవగాహన కల్పిస్తున్నా అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం పాలు, గుడ్డు, బాలామృతం మాత్రమే అందిస్తున్నారు. చిరుధాన్యాలు, రక్తహీనతను తగ్గించే బెల్లం, పల్లీ పట్టీల వంటి వాటిని ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. చురుకుదనం పెంచేలా ఆహారం జిల్లాలో మొత్తం 706 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 34,061 మందికి పిల్లలకు విద్యనందించడంతో పాటు బలవర్ధక ఆహారం అందిస్తున్నారు.ఇందులో 32,335 మంది సాధారణ బరువు, సమతుల ఆరోగ్యం కలిగి ఉన్నారు. 1,515 మంది తీవ్ర పోషకాహార లోపంతో, 211 అతి తీవ్ర పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. తీవ్ర పోషక లోపం కలిగిన చిన్నారులు తరచూ అనారోగ్యానికి గురి కావడం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. అతి తీవ్ర పోషకాహార లోపంతో బాధ పడుతున్న చిన్నారుల్లో కళ్లు పాలిపోవడం, పాదాల్లో నీరు, అడుగు తీసి అడుగు వేయలేకపోవడం,

అతి నీరసంతో చురుకుదనం లోపించడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో యంత్రాలతో బాల బాలికల బరువు తూచడం, వారితో మాట్లాడి ఆరోగ్య వివరాలు సేకరించడం, ఆహార, ఆహార్య అలవాట్లు మార్చి వారిలో చురుకుదనం తీసుకొచ్చే ఆహార పదార్థాలు అందిస్తున్నారు. బరువు లేక నీరసంగా ఉండే చిన్నారులను గుర్తించి విటమిన్ బీ-12, బీ-17, బీ-6 విటమిన్లు లభించే చిరుధాన్యాలతో బలవర్ధక ఆహారాలు ఇస్తే వారిలో అనారోగ్య సమస్యలు పూర్తిగా తొలగిపోతాయి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించి ఉపాధిహామీ పనులకు వెళ్లే వారు అధిక సంఖ్యలో ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో అంగన్‌వాడీ సరకులతోనే పిల్లల కడుపు నింపుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

అంగన్‌వాడీ చిన్నారులతో పాటు పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు చిరు ధాన్యాలు, పోషకాహార ప్రాముఖ్యాన్ని తెలిపేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పిల్లల్లో పోషకాహార లోపాలు లేకుండా తల్లిదండ్రులు అంగన్‌వాడీల ద్వారా బలవర్ధక ఆహారం అందించాలి. అతి తీవ్ర పోషక లోపాలున్న వారికి అదనంగా గుడ్డు, పాలు, బాలామృతం వంటివి అందిస్తున్నాం. రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

# యాసంగి పంటలకు నీటి విడుదల

బోయినపల్లి : రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) నుంచి యాసంగి పంటలకు నీటి విడుదల కొనసాగుతుంది. దిగువన ఎల్‌ఎండీ జలాశయంతోపాటు కుడి, ఎడమ కాలువ, అన్నపూర్ణ జలాశయానికి అవసరమైన మేరకు మధ్యమానేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన రాజరాజేశ్వర జలాశయానికి (మధ్యమానేరు) ప్రస్తుతం రామడుగు మండలంలోని గాయత్రి పంపు హౌజ్ నుంచి వరద కాలువ ద్వారా ఇన్‌ఫ్లో వస్తుంది. 2022 జూన్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి గాయత్రి పంపు హౌజ్ ద్వారా 14.336 టీఎంసీలు, మానేరు, మూలవాగుల నుంచి 40.244 టీఎంసీల వరద, ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 27.004 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువన ఎల్‌ఎండీ, కుడి, ఎడమ కాలువ, అన్నపూర్ణ జలాశయం, వేములవాడ గుడి చెరువు, మిషన్ భగీరథకు నీటి సరఫరా జరుగుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేస్తున్నారు. 2002 జులైలో ఎల్‌ఎండీకి 11.485 టీఎంసీలు, ఆగస్టులో 10.32, సెప్టెంబరులో 15.036, అక్టోబరు 2.53 టీఎంసీల నీటిని విడుదల చేశారు. యాసంగిలో పంటలకు నీరు విడుదల చేయాలని రైతులు కోరడం, ఎల్‌ఎండీ జలాశయం అధికారులు నీటిని విడుదల చేయాలని చెప్పడంతో డిసెంబరు నెల నుంచి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. డిసెంబరులో 0.592, 2023 జనవరిలో 4.634 టీఎంసీలు, ఫిబ్రవరిలో 11.051 టీఎంసీల నీటిని విడుదల చేయగా మార్చిలోనూ కొనసాగిస్తున్నారు. వీటితోపాటు కుడి కాలువకు 1.615 టీఎంసీలు, అన్నపూర్ణ జలాశయానికి 7.516 టీఎంసీల నీటిని వదిలారు. ఇదే సమయంలో మిషన్ భగీరథకు 0.825 టీఎంసీలు విడుదల చేశారు. ఏప్రిల్ వరకు...యాసంగి పంటలకు నీరందించడంలో భాగంగా ఏప్రిల్ వరకు నీటి విడుదలను కొనసాగించనున్నట్లు సమాచారం. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయంలో 20.51 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి గాయత్రి పంపుహౌజ్ నుంచి వరద కాలువ ద్వారా 4,900 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. రెండు గేట్ల నుంచి దిగువన ఎల్‌ఎండీకి 4,800 క్యూసెక్కులు, కుడి కాలువకు 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

రైతులకు ప్రయోజనం

నాలుగెకరాల్లో వరి సాగు చేశాను. మానేరు వాగులో బోరు ఉండటంతో వ్యవసాయ పొలం వరకు లిఫ్ట్ వేసి పంటలకు నీరందిస్తున్నాను. జలాశయం నుంచి దిగువన ఎల్‌ఎండీకి నీటిని విడుదల చేయడం వల్ల బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరిగాయి. నీటి విడుదలతో దిగువన రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.రామకృష్ణ, రైతు, మల్లాపూర్ఎల్‌ఎండీ అధికారులు కోరడంతో...యాసంగి పంటల సాగు ప్రారంభంలోనే నీటిని విడుదల చేయాలని ఎల్‌ఎండీ జలాశయం అధికారులు కోరడంతో నీటిని వదులుతున్నాం. పంటలు ముగిసే వరకు నీటి విడుదల కొనసాగుతుంది. కుడి, ఎడమ కాలువ, అన్నపూర్ణ జలాశయానికి విడిచిపెడుతున్నాం.జగన్, ఈఈ, మధ్యమానేరు

# మత్తులో యువత

కరీంనగర్ : గంజాయి గమ్మత్తులో యువతరం మసకబారుతోంది. జిల్లాలో యువత సరదాతో మొదలుపెట్టి.. మత్తు బారిన పడుతూ నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితంగా ఉండే విష సంస్కృతి పల్లెలకూ పాకింది.గంజాయి గమ్మత్తులో యువతరం మసకబారుతోంది. జిల్లాలో యువత సరదాతో మొదలుపెట్టి.. మత్తు బారిన పడుతూ నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితంగా ఉండే విష సంస్కృతి పల్లెలకూ పాకింది. యువకులు, విద్యార్థులే లక్ష్యంగా గంజాయి ముఠాలు వల విసురుతున్నాయి.

విద్యార్థులు లక్ష్యంగా..

యువకులు, విద్యార్థులను లక్ష్యంగా గంజాయి విక్రయాలు చేస్తున్నారు. కరీంనగర్ శివారులోని ఇంజినీరింగ్ కళాశాలలు, పీజీ కళాశాలల్లో, కొత్తపల్లి మండలం రేకుర్తి, బావుపేట, చింతకుంట, మండలంలోని గ్రానైట్ పరిశ్రమల ప్రాంతాల్లో, పల్లెలో గంజాయి అమ్మకాలు సాగుతున్నట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో అడ్డాలు ఏర్పాటు చేసి విద్యార్థులను ఈ మత్తుకు బానిసలుగా చేస్తున్నారు. సరదాగా తీసుకునే యువతను... శ్రమ మరిచిపోవడానికి కార్మికులను దృష్టిలో ఉంచుకుని విక్రయాలు చేపడుతున్నారు. సరదాకు, తాత్కాలిక ఆనందానికి గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

గుట్టు చప్పుడుకాకుండా..

కరీంనగర్‌లో రూ.500 నుంచి రూ.1000 వరకు గంజాయి పొట్లాలను ముఠాలు విక్రయిస్తున్నాయి. బాలలు, యువకులు నిర్మానుష్య ప్రాంతాల్లో సిగరెట్‌లో గంజాయి పొడిని కూర్చి గుట్టుగా మత్తులో విహరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇలా చేస్తూ రోజు మత్తు మయం చేసుకుంటున్నారు. సిగరెటు అందుబాటులో లేని వారు పేపరును గుండ్రంగా చుట్టి దానిలో గంజాయి పొడిని ఎక్కించి తాగుతున్నారు. మత్తు బాబుల కోసం రేకుర్తి శివారులో రెండు, పద్మనగర్ పరిశ్రమల ప్రాంతం, సాలంపురలో, విజయపురికాలనీ, ప్రగతినగర్, కొత్తపల్లి మండలంలోని, చింతకుంట, శాంతినగర్, కమాన్‌పూర్, బావుపేట ప్రాంతాల్లో ప్రత్యేక నిర్మానుష్య ప్రాంతాలు ఉన్నట్లు సమాచారం.

పోలీసుల కళ్లుగప్పి రవాణా..

ముఠాలు పోలీసుల కళ్లు గప్పి గంజాయి రవాణాకు కీలక మార్గాలను ఎంచుకుంటున్నారు. ఒడిశా నుంచి రైలు మార్గంలో వరంగల్ వరకు అక్కడి నుంచి బస్సు, ప్రైవేటు వాహనాల్లో కరీంనగర్‌కు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ నుంచి గోదావరిఖని, లక్షెట్టిపేట నుంచి చొప్పదండి మీదుగా, మహదేవ్‌పూర్, మంథని నుంచి నేరుగా కరీంనగర్‌కు ఆటోలు, ద్విచక్రవాహనాలు, చెయ్యి సంచుల్లో సరఫరా చేస్తున్నారు. వస్త్రాల బేళ్లు, పార్శిల్ కవర్లుగా మార్చి, దూర ప్రాంతాలు ప్రయాణించే లారీలు, వ్యాన్ల క్యాబిన్లలో ప్రత్యేకంగా అరల్లో తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రేకుర్తిలో, కమాన్‌పూర్, విజయపురికాలనీ, శాంతినగర్, పద్మనగర్, ప్రగతినగర్‌లో విక్రమిస్తున్నట్లు తెలిసింది.

కొన్ని ఘటనలు.. రెండు రోజుల కిందట మంథనిలోని అయిదుగురు గంజాయి తాగుతుండగా పెట్రోలింగ్ పోలీసులకు చిక్కారు. ఓ వ్యక్తి భద్రాచలం నుంచి కొనుగోలు చేసి నలుగురికి విక్రయించినట్లు తేలింది. వారి వద్ద నుంచి 440 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మూడు నెలల క్రితం కొత్తపల్లి మండలం ఓ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు గంజాయిని కరీంనగర్‌కు తరలిస్తూ భద్రాచలం చెక్‌పోస్టు వద్ద పోలీసుల నిర్వహించిన తనిఖీల్లో ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. నాలుగు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొత్తపల్లిలోని మానేరు జలాశయం సమీపంలో గంజాయి తాగుతున్న ఇద్దరు బాలలను బ్లూకోల్ట్ సిబ్బంది పట్టుకున్నారు. ఇద్దరి ఫొటోలు తీసుకుని మైనర్లు కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చి వదిలిపెట్టినట్లు సమాచారం.అవగాహన కల్పిస్తున్నాంగంజాయితో ఆరోగ్యానికి జరిగే నష్టంపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. విక్రయాల సమాచారం వచ్చిన ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, నిఘా ఉంది.

# ఇళ్లకు తాళం... చోరీలకు ఆస్కారం..!

కొత్తగూడెం : వేసవి వచ్చిందంటే సెలవుల సరదా అంతా ఇంతా కాదు. చదువుల్లో నిమగ్నమైన విద్యార్థులు, పిల్లలు అమ్మమ్మ గారిల్లు.. నానమ్మ ఊరు అంటూ హడావుడి చేయడం సహజం. ఉద్యోగ రీత్యా బిజీగా ఉండే ఉద్యోగులు ఈసమయంలో కాసింత ఊరట పొందేందుకు, పిల్లలతో గడపడానికి ప్రాధాన్యమిస్తుంటారు. ఇవన్నీ సాఫీగా సాగిపోతే వేసవి సెలవుల మజానే వేరు. ఇదే అదనుగా కొందరు జల్సారాయుళ్లు దొంగతనాలకు పాల్పడుతుంటారు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. రక్త సంబంధీకులు, నమ్మకస్తుల్లో ఒకరిని తాళం వేసి ఉన్న ఇంటికి రక్షణగా ఉంచాలి. ఇంట్లో లేని సందర్భాల్లో విలువైన బంగారు, వెండి ఆభరణాలను సురక్షిత ప్రాంతాల్లో (లాకర్లలో) దాచుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో కొన్ని గంటలు మాత్రమే బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇంటికి పూర్తి రక్షణతో కూడిన



సాంకేతిక లాక్‌లు వినియోగించడం మంచిది. రోజుల తరబడి ఊరికి వెళ్లాల్సి వచ్చినప్పుడు సంబంధిత ఠాణాలో పోలీసులకు సమాచారం అందించాలి. ఆ ప్రాంతంలో గస్తీ పెంచుతాం. సాధ్యమైనంత వరకు స్థానికులు ఆయా వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. చోరీలు జరిగినా నిందితులను సత్వరం పట్టుకునేందుకు నిఘా నేత్రాలు దోహదపడతాయి. ఆయా ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడతారనే అనుమానమున్న వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందిస్తే వివరాలను గోప్యంగా ఉంచుతాం. అర్ధరాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తారసపడినట్లు అనిపిస్తే వెంటనే తలుపులు తీయకుండా డయల్ 100కు సమాచారమందించాలి. వేసవిలో ఆరుబయట నిద్రించేటప్పుడు విలువైన బంగారం ఆభరణాలను ధరించవద్దు. బీరువాలో విలువైన సామగ్రిని ఉంచి వాటి తాళాలను డ్రెస్సింగ్ టేబుల్స్, పడక గదిలో దిండ్ల కింద వదిలేసి వెళ్లకూడదు. కొన్ని సందర్భాల్లో ఇంట్లో ఆభరణాలున్న విషయాన్ని సన్నిహితులు, బంధువులకు సైతం తెలియకుండా జాగ్రత్తపడాలి.

వేసవిలో గస్తీ పెంచుతాందొంగతనాల నివారణకు పోలీసుశాఖ పరంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను విస్తృతపరిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వేసవిలో సిబ్బందిని బృందాలుగా నియమించి గస్తీ పెంచుతాం. అన్ని ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు యత్నిస్తున్నాం.రెహమాన్, డీఎస్పీ, కొత్తగూడెం

# తిరస్కరణలే అధికం



మహబూబాబాద్ : పట్టణాల్లో గృహ నిర్మాణాలు చేసుకునే పేదలకు సరళతరమైన విధానంతో వేగంగా అనుమతులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ పురపాలక శాఖ 'స్వీయ మదింపు' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పేదలపై ఆర్థిక భారం పడకుండా 75 చదరపు గజాలలోపు విస్తీర్ణం గల స్థలంలో ఇంటి నిర్మాణానికి నిబంధనల మేరకు అన్ని పత్రాలు జత చేస్తూ అంతర్జాలంలో స్వీయ దరఖాస్తు చేసుకున్న యాజమానులకు ఒక్క రూపాయి రుసుముతో అనుమతులను జారీ చేస్తోంది. స్థానిక అధికారుల ప్రమేయం లేకుండా పురపాలక ప్రధాన కార్యాలయం నుంచి అంతర్జాలంలోనే అనుమతి ఇస్తూ ఇంటి నెంబర్‌ను కేటాయిస్తుంది. ఈ అవకాశాన్ని పట్టణంలోని కొందరు వ్యక్తులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ స్థలాలు, 75 గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న స్థలాలు, కొలతల్లో ఉన్న తేడాలను గుర్తించి మహబూబాబాద్ పురపాలక సంఘంలో వచ్చిన దరఖాస్తుల్లో అధిక దరఖాస్తులను తిరస్కరించారు. ఇలాంటి అక్రమాలకు కళ్లెం వేసేందుకు పురపాలక అధికారులు నూతన విధానాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు సమాచారం.

ముందు నోటీసు.. తర్వాత అనుమతి ..

మహబూబాబాద్ పట్టణంలోని పాతబజార్‌లో ఓ వ్యక్తి తనకు వారసత్వంగా వచ్చిన 70 గజాల ఇంటి స్థలంలో ఇల్లు నిర్మాణం చేబట్టారు. అవగాహన లేక పాత ఇంటి స్థలంలోనే చిన్న గది నిర్మాణానికి అతను పురపాలక సంఘం నుంచి అనుమతి తీసుకోలేదు. ఈ విషయాన్ని గుర్తించి పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది పనులు నిలిపివేసి నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆ వ్యక్తి తన వద్ద ఉన్న పత్రాలతో 'స్వీయ మదింపు'లో అంతర్జాలంలో దరఖాస్తు చేసుకున్నారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉండడంతో ఆ ఇంటికి నెంబర్‌ను కేటాయించారు.

అక్రమాల అడ్డుకట్టకు నూతన విధానం

ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో 'స్వీయ మదింపు' ద్వారా ఇటీవల హైదరాబాద్‌లో జరుగుతున్న అక్రమాలను గుర్తించిన పురపాలక శాఖ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నూతన విధానం అమలు చేయనుంది. ఏప్రిల్ 1 నుంచి పురపాలక సంఘాల్లో ప్రత్యేక బృందాల ద్వారా అక్రమాలను గుర్తించి నూతన పురపాలక చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేసినా ఇంటి నెంబర్లు వచ్చినా ఆస్తిపన్ను చెల్లించనివారిపై చర్యలు తీసుకోనున్నారు. ఇంతకు ముందు పురపాలక శాఖ ప్రధాన కార్యాలయంలో మాత్రమే ఈ దరఖాస్తులను పరిశీలించేందుకు అవకాశం ఉండేది. కొత్తగా ప్రతి పురపాలక సంఘంలో స్వీయ మదింపునకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఓ అధికారి 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

తప్పుడు సమాచారంతో దరఖాస్తు

ఇంటి నిర్మాణ అనుమతి కోసం పురపాలక శాఖ కల్పించిన స్వీయ మదింపు కార్యక్రమాన్ని ఆసరాగా చేసుకున్న ఓ వ్యక్తి నిబంధనలు విస్మరించి గుముడూర్ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం ప్రారంభించారు. అంతర్జాలంతో 75 గజాల స్థలం ఉందంటూ పేర్కొన్నారు. ఆ ప్రాంతాన్ని సందర్శించిన పురపాలక సిబ్బంది ఇంటి నిర్మాణ విషయమై ప్రశ్నించగా అంతర్జాలంలో స్వీయ మదింపు చేసుకున్నట్లు తెలిపారు. పురపాలక శాఖ అధికారులు అంతర్జాలంలో చేసిన దరఖాస్తును పరిశీలించగా తప్పుడు సమాచారంతో ఉందని గుర్తించి ఆ ఇంటిని కూల్చివేశారు.

నిబంధనల మేరకు పత్రాలు ఉంటేనే ఆమోదం

-నవీన్‌కుమార్, టీపీఎస్, మహబూబాబాద్

అంతర్జాలంలో నమోదు చేసుకున్నవారి దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తాం. నిబంధనల మేరకు పత్రాలు ఉంటేనే ఆ దరఖాస్తులను ఆమోదిస్తాం. కొందరు ఎలాంటి పత్రాలు లేకుండా దరఖాస్తులు చేశారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని తిరస్కరించాం.

# సంతకాల దందా నిగ్గుతేలేనా..?

ఖమ్మం : ఖమ్మం గ్రామీణ మండలంలో కొన్నేళ్ల నుంచి సాగుతున్న ఫోర్జరీ సంతకాల వ్యవహారం మలుపులు తిరుగుతోంది. కొంతమంది స్థిరాస్తి వ్యాపారులు, బిల్డర్లు, దళారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తుండటంతో ఈకేసులో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయనేది ఆసక్తికరంగా మారింది. కేసు నమోదవటం, అరెస్టుల పర్వం ప్రారంభమవడంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈదందాలో భాగస్వాములుగా ఉన్నవారు తమకు ఉచ్చు బిగుసుకోకుండా తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారు.

అసలేం జరిగిందంటే..?

ఖమ్మం గ్రామీణ మండలంలోని పెద్దతండా, ఏదులాపురం, గుర్రాలపాడు, గుదిమళ్ల, వెంకటగిరి గ్రామాలను ఖమ్మం నగరపాలక సంస్థలో విలీనం చేస్తూ ప్రభుత్వం 2018లో ఉత్తర్వులు వెలువరించింది. కోర్టు కేసుల నేపథ్యంలో విలీన ప్రక్రియ పూర్తయ్యేందుకు సుమారు ఏడాది పట్టింది. నగరపాలక సంస్థలో కలిస్తే అనధికారిక వెంచర్లలో ఇంటి అనుమతులు తీసుకోవడం ఇబ్బందిగా మారుతుందని, ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని గ్రహించిన కొందరు స్థిరాస్తి వ్యాపారులు, బిల్డర్లు వక్రమార్గాన్ని ఎంచుకున్నారు. ఆయా పంచాయతీల్లోనే ఇంటి అనుమతులు పొందేందుకు యత్నించారు. ఈ తతంగాన్ని గుట్టుగా నడిపేందుకు దళారులు రంగప్రవేశం చేశారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా ఫోర్జరీ సంతకాలతో ఇంటి అనుమతులు ఇచ్చే ప్రక్రియకు తెరలేపారు. రూ.70 వేల నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేసి పంచాయతీ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఇంటి అనుమతులివ్వడం ఆరంభించారు. బ్యాంకు రుణాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకపోవటంతో ఈ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. ఈక్రమంలో కొందరు వ్యాపారులు సైతం ఫోర్జరీ సంతకాల దందా మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

బయటకొచ్చిందిలా..

ఖమ్మం నగరపాలికలో విలీనమైన గ్రామాలను 2020లో ప్రభుత్వం మళ్లీ పంచాయతీలుగా మారుస్తూ గ్రామీణం మండలంలో కలిపింది. తనగంపాడు రెవెన్యూ పరిధిలోని 5.38 ఎకరాల భూమిని కాజేసేందుకు కొందరు యత్నించారు. భూయజమాని, అతడి భార్య మరణించినట్లు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ఓ దత్తపుత్రుడిని తెరపైకి తెచ్చారు. దత్తపుత్రుడి పేరిట భూమిని బదలాయించిన వైనం బట్టబయలైంది. దీనిపై పోలీసులకు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తొమ్మిది మంది నిందితుల్లో ఏడుగురిని అరెస్టు చేశారు. ఈకేసు దర్యాప్తు క్రమంలోనే ఫోర్జరీ సంతకాల వ్యవహారం వెలుగుచూసింది. పంచాయతీ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకరిని అరెస్టు చేయగా మరొకరు పరారీలో ఉన్నారు.

గుట్టు రట్టవుతుందా..?

ఖమ్మం గ్రామీణ మండలంలో ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండిపడింది. ఈ దందాలో స్థిరాస్తి వ్యాపారులు, బిల్డర్లు, దళారుల పాత్ర ఉన్నట్లు సమాచారం. అయితే.. వీరిపై పోలీసుల దర్యాప్తు కార్యాచరణ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. లోతుగా విచారించి గుట్టు రట్టు చేస్తారా..? లేదా ఒకరిద్దరి అరెస్టులతోనే మమ అనిపిస్తారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫోర్జరీ సంతకాలతో కొందరు ప్రభుత్వ భూములు, పంట కాల్వలను వెంచర్లలో కలుపుకొని సొమ్ము చేసుకున్న సంగతిని తేలుస్తారేమో వేచిచూడాలి.

# ఖాళీ స్థలం.. కనిపిస్తే వదలరు!



వరంగల్ : ఓరుగల్లు నగరంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు నకిలీ పత్రాలు సృష్టించి అసలు యజమానులను బెదిరించి భూ కబ్జాలకు పాల్పడే ముఠాల ఆగడాలకు ఇది పరాకాష్ఠ. హనుమకొండ నగరం నడిబొడ్డున ప్రశాంత్‌నగర్‌లో తమ స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని 16 మంది బాధితులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. వీరి స్థలం ఆక్రమణ వెనక పలువురు బడా నేతలు ఉన్నారు. ఓ మహిళను ముందు పెట్టి ఆక్రమణలకు తెగబడడం గమనార్హం.

పది రోజుల్లో ఆరు కేసులు నమోదు వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ భూ కబ్జాదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతో బాధితులు ఒక్కొక్కరిగా ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల ప్రశాంత్‌నగర్ బాధితులు న్యాయం చేయాలని కోరుతూ తాము కొనుగోలుచేసిన పత్రాలతో కాజీపేట పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు వారి నుంచి దరఖాస్తులు తీసుకొని కేసులు నమోదు చేశారు. పది రోజుల వ్యవధిలోనే ఆరు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆరు కేసుల్లో నిందితురాలిగా ఒకే మహిళ పేరు ఉండడం చూసి పోలీసులు విస్తుపోయారు. ఈ మహిళతో పాటు మరికొంత మందిపైనా కేసులు నమోదయ్యాయి. ఆక్రమణదారుల్లో వరంగల్ కమిషనరేట్కు చెందిన ఒక పోలీసు కానిస్టేబుల్ పేరు కూడా ఉంది. కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ ఈ వ్యవహారంలో సదరు మహిళను పిలిచి విచారించగా తనకేమీ తెలియదని.. కొందరు నేతలు చెప్పినట్టు తాను చేశానని ఎక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడ పెట్టానని బదులిచ్చినట్టు తెలిసింది.

ముఠాగా ఏర్పడి..

కొన్ని దశాబ్దాల కిందట ఓ సొసైటీ ప్రశాంత్‌నగర్‌లో 18 ఎకరాలను కొనుగోలు చేసి ప్లాట్లను విక్రయించింది. ఈ స్థలాలను అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్యులు కొనుగోలు చేశారు. ఈ ప్రాంతంలో 16 మంది తమ చమటోడ్చి కొనుగోలు చేసిన స్థలాలను ముఠాగా ఏర్పడిన బడా నేతలు ఆక్రమించుకున్నారు. 1963 ప్రాంతంలో భూములు విక్రయించిన వారి కుటుంబీకుల్లో ఒకరిద్దరిని ముందు పెట్టి వారి పేరుతో నకిలీ పత్రాలు సృష్టించారు. అసలు యజమానులను స్థలం వద్దకు రాకుండా బెదిరింపులకు దిగుతున్నారు. సెటిల్‌మెంటు చేసుకొని తాము అడిగినంత ఇస్తే స్థలాన్ని వదిలి పోతామని రూ.లక్షల్లో డిమాండు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ప్రశాంత్‌నగర్‌లో ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొనుగోలు చేసిన 200 గజాల స్థలం న్యాయస్థానంలో వివాదంలో ఉండగానే ఓ కానిస్టేబుల్ కొనుగోలు చేసి ఏకంగా రూ.కోటిన్నరతో మూడంతస్తుల భవనాన్ని నిర్మించాడు. సదరు ఉపాధ్యాయుడు ఫిర్యాదు చేయగా కానిస్టేబుల్‌పై కూడా కేసు నమోదైంది. భూ బాధితుల్లో ఒక ఎస్ఐ కూడా ఉన్నారు.

కబ్జా ముఠాలో మొత్తం 19 మంది ఉన్నట్టు బాధితులు గుర్తించి వారి పేర్లతో ఒక జాబితా కూడా సిద్ధం చేసి సీపీకి అందజేశారు.

ప్రయివేటు వ్యక్తుల స్థలాలే కాదు.. ముఠా కన్నుపడిందంటే ప్రభుత్వ స్థలాన్ని కూడా ఆక్రమించేస్తున్నారు. ఇటీవల ప్రశాంత్ నగర్‌లో 60 అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డును ఆక్రమించేందుకు కబ్జాదారులు విఫలయత్నం చేశారు. స్థానికులు తీవ్ర స్థాయిలో స్పందించడంతో వెనక్కి తగ్గారు.

# అటవీ సిబ్బంది లేరు.. పర్యవేక్షణ బేజారు

మహబూబాబాద్ : భూపాలపల్లి జిల్లాలోని రెండు అటవీ సబ్ డివిజన్‌లలో కొంత కాలంగా సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రధానంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తూ వన సంపదను కంటికి రెప్పలా సంరక్షించే ఎఫ్‌బీవో(బీట్ ఆఫీసర్లు)ల కొరత ఉండటంతో పర్యవేక్షణ లేమి కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఒక్కో బీట్ అధికారికి సుమారుగా నాలుగు నుంచి ఐదు బీట్ల వరకు అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంతో ఆ భారాన్ని మోయలేక శారీరకంగా,మానసికంగా సతమతమవుతున్నారు. మళ్లీ పాత పరిస్థితులే..రెండేళ్ల క్రితం ప్రభుత్వం చేపట్టిన నూతన బీట్ అధికారుల నియామకంతో భూపాలపల్లి జిల్లాలోని అటవీ శాఖ పరిధిలో కొంత మేరకు సిబ్బంది కొరత తీరింది. కొత్తగా నియామకం అయిన వారిలో చాలా మంది యువతీ యువకులే ఉన్నారు. వారిలో కొందరు ఉన్నత చదువులకై సెలవులపై వెల్లడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. జిల్లాలోని ఆజంనగర్, పలిమెల, దూదేకులపల్లి, మహదేవపూర్, పెగడపెల్లి రేంజిల పరిధిలో పనిచేయడం అంటే కత్తి మీదుసాములాంటింది. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా వన్యప్రాణుల వేట, కలప స్మగ్లింగ్, ఇసుక, మొరం, మట్టి తదితర విషయాల్లో అక్రమాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ముఖ్యంగా పోడు పేరిట అడవుల నరికివేత యథేచ్ఛగా సాగుతోంది. వీటిని నిరోధించడం సవాలుగా మారిన నేపథ్యంలో ఉద్యోగుల నుంచి నిరాసక్తత ఎక్కువయ్యింది. కలప అక్రమ రవాణాను అరికట్టడానికి అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలు సైతం సిబ్బంది లేక వెలవెలబోతున్నాయి.

# రైతులపై విద్యుత్తు ఉపకరణాల ధరల భారం

మహబూబాబాద్ : విద్యుత్తు సరఫరా వ్యవస్థలో వినియోగించే ఉపకరణాల ధరలు భారీగా పెరగడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడనుంది. కొత్తగా విద్యుత్తు కనెక్షన్ తీసుకునే వారిపై 30 శాతం అధికంగా భారం మోపనున్నారు. రైతులకు ప్రభుత్వమందించే రాయితీ పోగా అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన.. ఇప్పటికే వడగళ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులపై, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల రుసుములు పెంచి భారం మోపడం ఆందోళనకు గురిచేస్తోంది. వీరితో పాటు గృహ, వాణిజ్య అవసరాలకు కొత్త విద్యుత్తు కనెక్షన్ తీసుకునే వారిపై అదనపు భారం పడనుంది.

పెరగని రాయితీ...

వ్యవసాయ అవసరాలకు అందించే విద్యుత్తు సామగ్రిపై ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. వీటిలో రెండు రకాల రాయితీలు ఉన్నాయి. సాగు అవసరాలకు కొత్తగా విద్యుత్తు కనెక్షన్ కావాల్సిన రైతు ముందుగా మీసేవ కేంద్రంలో రూ.5,295 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్తు శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలను పరిశీలించి అంచనా సిద్ధం చేస్తారు. కనెక్షన్ ఇచ్చేందుకు.. అందుబాటులో నియంత్రిక ఉండి రైతు పొలం వరకు మూడు విద్యుత్తు స్తంభాలు, తీగ లాగడం, బిగించడం వంటి పనులు మాత్రమే ఉంటే ప్రభుత్వం రూ.45 వేల రాయితీ ఇస్తుంది. నియంత్రికను కూడా బిగించాల్సి



వస్తే రూ.70 వేల రాయితీ అందిస్తుంది. అదనంగా స్తంభాలు, తీగ, సామగ్రి అవసరమైతే ఔట్‌రైట్ కంట్రిబ్యూషన్ (ఓటీసీ) ఛార్జీలను రైతే భరించాల్సి వచ్చేది. పెరిగిన విద్యుత్తు ఉపకరణాల ధరలకు అనుగుణంగా రాయితీని పెంచకపోవడంతో రైతులు భరించాల్సిన ఖర్చులు పెరిగాయి. ఇది వారికి ఆర్థిక భారం కానుంది.

సాధారణ వినియోగదారులపై కూడా..

కొత్త కాలనీలు, వ్యవసాయబావుల వద్ద నివాస గృహాలు, గ్రామానికి దూరంగా ఉన్న ఇళ్లు, వ్యాపార, వాణిజ్య అవసరాలకు కొత్త విద్యుత్తు కనెక్షన్ కావాలంటే.. అధికారుల అంచనా మేరకు లైన్ ఛార్జీలను పూర్తిగా చెల్లిస్తేనే కనెక్షన్ ఇస్తారు. వీరికి ఎలాంటి రాయితీ ఉండదు. ప్రస్తుతం ఉపకరణాల ధరల పెంపుతో వీరిపై కూడా అదనపు భారం పడనుంది. ఒక నియంత్రిక, నాలుగు స్తంభాల దూరంతో విద్యుత్తు కనెక్షన్ కావాలంటే గతంలో రూ.1.30 లక్షల నుంచి 1.50 లక్షల వరకు అయ్యే ఖర్చు ప్రస్తుతం రూ.2 లక్షలకు పెరగనుంది. పెరిగిన విద్యుత్తు సామగ్రి ధర, జీఎస్టీ, సంస్థ ఛార్జీలు.. అన్నీ కలిపితే మోయలేనంత ఆర్థిక భారం పడుతుందని వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి-కుంచం సోమయ్య, రైతు, కొడకండ్ల

ఇరవై రోజుల క్రితం మరో ముగ్గురు రైతులతో కలిసి.. ఒక నియంత్రికతో మా వ్యవసాయ బోర్ల వద్దకు స్తంభాలు వేసి కనెక్షన్ ఇవ్వాలని కోరుతూ మీసేవ కేంద్రంలో దరఖాస్తు అందజేశాం. డీడీలు చెల్లించాం. అధికారులు అంచనాలు సిద్ధం చేస్తామన్నారు. ఈ లోగా నియంత్రికలు, తీగలు, స్తంభాలు, ఇతర సామగ్రి ధరలు పెరిగినట్లు తెలిసింది. కనెక్షన్ మంజూరైతే రాయితీ పోగా అధికంగా ఎంత మొత్తం చెల్లించాలోనని ఆందోళన చెందుతున్నాం. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు అందించే రాయితీని పెంచాలని కోరుతున్నాం.


# వ్యర్థానికి అర్థం చెప్పేదెప్పుడు?

కరీంనగర్ : ఇలా నిత్యం దాదాపు 9 ఎకరాల స్థలంలో గుట్టలను తలపించే చెత్తకుప్పల్లో అగ్గిరాజుకుంటుంది. రేయింబవళ్లు పొగను, దుర్వాసన వెదజల్లుతూ నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఆకర్షణీయ పట్టణంలో అన్ని హంగులు అభివృద్ధి విషయంలో దరి చేరుతున్నా.. డంపింగ్ యార్డు సమస్య మాత్రం ఇప్పటికీ.. తీరని వ్యథగానే మారిపోయింది. ఏళ్ల తరబడి చెత్త వ్యర్థానికి అర్థం చెప్పలేని దుస్థితిలో బల్దియా ఉంది. వేసవి వచ్చిందంటేనే ఇందులో నుంచి వచ్చే పొగతో సమీపంలోని రాజీవ్ రహదారిపై ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ముందుకు సాగుతున్నారు. మరో వైపు సమీప కాలనీవాసుల ఆరోగ్యానికి ఇది ఊహించని ముప్పుగానే మారుతోంది. మానేరు పరివాహక ప్రాంతంలో ఉన్న చెత్తను బయోమైనింగ్ విధానంతో తొలగించాలనే ప్రక్రియ కొనసాగుతున్నా.. ఇది మూడడుగులు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అనే పరిస్థితి ఉంది. రూ.16 కోట్లతో బయోమైనింగ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పి నిత్యం దాదాపు 700-800 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ఇక్కడి ప్రాంతంలో తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 45-50 వేల మెట్రిక్ టన్నులను తగ్గించారు. ఇదే సమయంలో రోజూ వారీగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఉత్పత్తి అయ్యే చెత్త 150-200 మెట్రిక్ టన్నులు ఇక్కడికే వచ్చి చేరుతోంది. ఓ వైపు గుట్ట తరిగినట్లే.. అనిపిస్తున్నా.. మరో వైపు క్రమంగా ప్రతి రోజు వచ్చి చేరుతున్న కొత్త చెత్తతో పెరుగుతూనే ఉంది. ఈపాటికే ఇక్కడి ప్రాంతం నుంచి మొత్తం చెత్తను తొలగించాలని యంత్రాంగం నిర్ణయించినా ఆ దిశగా మాత్రం పురోగతి కనిపించడంలేదు. మరో వైపు గుట్టల్లా పేరుకున్న డంపింగ్ యార్డును ఆనుకునే మానేరు రివర్‌ఫ్రంట్ పనులు జరుగుతుండటంతో ఎట్టి పరిస్థితుల్లో దీన్ని ఇక్కడి నుంచి తీసేయాలనే ప్రతిపాదనలు తెరమీదకు వస్తున్నాయి.

స్థలాభావమే అసలు సమస్య..ఇప్పుడున్న చెత్తను వేరే చోటకు మార్చాలన్నా.. లేదా కొత్తగా ఏరోజుకు ఆరోజు చెత్తను మరో చోట వేయాలన్నా.. నగర శివారులో ఇందుకోసం ప్రత్యేకంగా స్థలాన్ని ఇప్పటి వరకు కేటాయించకపోవడమనేదే అసలు సమస్యగా మారింది. గతంలో ముగ్ధుంపూర్ సమీపంలో కొంత స్థలాన్ని కేటాయించినా.. తరువాత అక్కడ వద్దనే నిర్ణయాన్ని అధికారులు తీసుకున్నారు. కొత్తగా మరో చోట దాదాపు 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని ఇవ్వాలని బల్దియా నుంచి జిల్లా పాలనాధికారికి పలుమార్లు వినతులు వెళ్లినా.. ఇప్పటికీ స్థల కేటాయింపు జరగలేదు. స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా రూ.36 కోట్లను కొత్తగా అందించే స్థలంలో చేపట్టే పనులకు కేటాయించారు. తడి, పొడి చెత్తను ఎప్పటికప్పుడు వేరు చేసే ఆధునిక విధానాలను అమలు చేయాలని భావించారు. ఆహ్లాదకరంగా అక్కడి ప్రాంతాన్ని మార్చేలా చెట్ల పెంపకంతోపాటు సుందరమైన పార్క్‌ను అక్కడ నిర్మించేలా ప్రణాళికను కార్పొరేషన్ సిద్ధం చేసింది. కేవలం చోటు ఎక్కడనేది ఖరారు కాకపోవడంతో ఇంకా దీని ఏర్పాటుకు జాప్యం జరుగుతోంది. వీలైనంత తొందరగా డంపింగ్ యార్డు సమస్యను తీరుస్తామని మేయర్ సునీల్‌రావు అన్నారు. కొత్తగా స్థలం కోసం అన్వేషిస్తున్నామని, జిల్లా పాలనాధికారి నుంచి తగిన ఆదేశాలు రాగానే అక్కడ అవసరమైన పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

# నిబంధనలకు ముసుగేసి.. అక్రమాలకు తెర తీసి..!

నిర్మల్ : నిర్మల్.. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతోంది. పల్లె ప్రజలు పట్నం'దారి' పట్టడంతో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. భవన నిర్మాణ అనుమతి విషయంలో ప్రభుత్వం టీఎస్‌- బీపాస్ అమలులోకి తీసుకొచ్చినా.. అందుకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ఇంటి నిర్మాణ అనుమతుల నిబంధనలు కఠినతరంగా చేయడంతో కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్ చేయడంతో చాలా మంది దరఖాస్తులు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఆదర్శనగర్, సోఫినగర్, రాంనగర్, అస్రానగర్, గాయత్రినగర్, ప్రియదర్శినినగర్, శాస్త్రినగర్, విద్యానగర్, శాంతినగర్, తదితర ప్రాంతాల్లో నిబంధనలకు తూట్లు పొడుస్తూ అడ్డగోలు నిర్మాణాలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వంద గజాల స్థలంలో నిర్మిస్తే పదిశాతం స్థలం మున్సిపాల్టీకి కేటాయించాలి. భవనాలకు సెట్‌బ్యాక్ ఉండాల్సి ఉన్నా ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు.లి పట్టణాల్లో దుకాణ సముదాయాలన్నీ సెట్‌బ్యాక్ (ముందు కొంతస్థలం) లేకుండానే నిర్మిస్తున్నారు. భవనానికీ భవనానికి మధ్య మీటరు నుంచి మీటరున్నర వరకు ఖాళీస్థలం వదలాల్సి ఉండగా ఎవరూ పాటించడం లేదు. బహుళ అంతస్తుల విషయంలోనూ జిల్లా ఏర్పడక ముందు కేవలం పదిలోపు ఉంటే ఇప్పుడు 50కిపైగా ఉన్నాయి. 'పుర' అధికారుల లెక్కల ప్రకారం 35 వాటికి అనుమతులు



ఉండగా.. మిగతావి అనుమతులకు దరఖాస్తులు చేసుకున్నవే అయినా వాటి నిర్మాణాలు జరిగాయి. బహుళ అంతస్తులు, భారీ భవంతులున్న ప్రియదర్శినినగర్, ఆదర్శనగర్, ఆదర్శనగర్, శాస్త్రినగర్, శాంతినగర్, ఈద్గాం, దివ్యనగర్, విజయనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఎలాంటి నిబంధనలు కనిపించవు. భవనం చుట్టూ అగ్నిమాపక వాహనం వెళ్లడానికి వీలుగా వీటిని నిర్మించాల్సి ఉన్నా.. ఇక్కడున్న వాటిల్లో ఖాళీ స్థలం వదలకపోవడంతో అగ్నిమాపక వాహనం వెళ్లదు.

అధికారుల మాట...జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా ఇళ్లు, భవన, బహుళ అంతస్తులు అనుమతుల్లేకుండా నిర్మిస్తున్నారనే విషయమై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను అడిగితే.. కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారనే విషయం దృష్టికి వచ్చిందని చెబుతున్నారు. వాటికి నోటీసులు జారీ చేశామని స్పష్టం చేసినా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నింగా.. సమాధానం దాట వేస్తుండటం చూస్తుంటే వారిపై రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు స్పష్టమవుతోంది.ఎక్కడెక్కడంటే.. పట్టణ శివారు ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన ఓ నేత బహుళ అంతస్తుల నిర్మాణాలకు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న విషయం అధికారులకు తెలిసినా ఆ నిర్మాణం రాజకీయ నేతది కావడంతో మిన్నకుండిపోయారు. మంచిర్యాలరోడ్‌లో రెండు బహుళ అంతస్తుల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినట్లు అధికారులు గుర్తించినా.. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ప్రియదర్శినినగర్, ఈద్గాం, ఆదర్శనగర్, దివ్యనగర్, శాంతినగర్, విద్యానగ ర్, మంజులాపూర్, విజయనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లోనూ అనుమతులు ఒక తీరు ఉంటే నిర్మాణాలు మరో తీరు చేపట్టారు.

# హద్దు మీరి ఆక్రమణ..!

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఖరీదైన చెరువు శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆ భూములు రోజురోజుకు ఆక్రమణదారుల చేతుల్లోకి పోతున్నాయి. చెరువు శిఖం, బఫర్ జోన్ భూముల్లో ఇప్పటికే అక్రమ నిర్మాణాలు వెలిశాయి. రాముని చెరువు శిఖం భూమిపై భూ అక్రమార్కుల కన్ను పడింది. దాదాపు రెండు ఎకరాల స్థలాన్ని కబ్జా చేయడానికి అక్కడ ఆలయ నిర్మాణం పేరుతో నేలపైనే దేవతల విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. చెరువు పక్కన ఉన్న ఓ వెంచర్ యజమానులు గతంలో శిఖం భూమిలో రహదారులు నిర్మించగా, రెండేళ్ల కిందట అప్పటి పాలనాధికారి ఆర్వీ కర్ణన్ సర్వే చేయించి వాటిని తొలగించారు. హమాలివాడలో పోచమ్మ చెరువు కుంట 64.39 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఆ శిఖం పరిధిలో గతంలో చాలామంది ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. అప్పటి పాలనాధికారి శిఖం భూమికి రక్షణ కల్పించడానికి ఎఫ్‌టీఎల్ లెవల్ హద్దులు కేటాయించడానికి సర్వే చేయిస్తే అక్కడి నివాస గృహాల ప్రజలు అడ్డుకున్నారు. పురాతన కాలం నుంచి అక్కడ ఇళు



_ నిర్మించుకొని ఉంటున్నామని, అది శిఖం కాదు తమ సొంత భూములు అంటూ తరచూ సర్వేను అడ్డుకుంటున్నారు. పట్టణంలో ఇలా మరికొన్ని చెరువు శిఖం భూములు ఆఅక్రమదారుల చేతుల్లోకి పోతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి చెరువు శిఖం భూములకు రక్షణ కంచె ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.హమాలివాడలోని పోచమ్మ చెరువు శిఖం భూమి వివాదాస్పదంగా మారింది. నీటి పారుదల శాఖ రికార్డు ప్రకారం అక్కడ 64.39 ఎకరాలు ఉంది. అందులో అనేక మంది ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. మరికొందరు శిఖం భూమిలో తాత్కాలిక షెడ్లు నిర్మించారు. ఈ శిఖం భూమి సమస్య చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది.

మంచిర్యాలలో ఖరీదైన రాముని చెరువు శిఖం భూమిని కబ్జా చేయడానికి స్థిరాస్తి వ్యాపారులు చాలా రోజుల నుంచి కుట్ర చేస్తున్నారు. శిఖం భూమిని కబ్జా చేయడానికి భూ వ్యాపారులు చేస్తున్న ప్రయత్నాలను రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారు. ఆ భూమిని ఆక్రమించుకోవడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.

# పొంతన ఏదీ!

వికారాబాద్ : వికారాబాద్ మండలం, సిద్దులూరు గ్రామం(చించలంపట్టీ)లో రెవెన్యూ, నక్షా రికార్డులకు పొంతన లేదు. ఒక సర్వే నెంబర్‌లో కొనసాగాల్సిన కొందరు రైతులు మరో సర్వే నెంబర్‌లో కొనసాగుతున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు ఐదారు సర్వే నెంబర్లలో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఏ సర్వే నెంబర్‌లో పట్టా ఉండి ఏ పొలంలోనైతే కబ్జాలో ఉన్నారో అదే పొలం తమదని భావించి మూడు, నాలుగు తరాలుగా సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 277 పట్టాదారు న క్షా రికార్డు ప్రకారం 271లో కొనసాగుతుండేవారు. సర్వేనెం. 279 పట్టాదారు నక్ష రికార్డు ప్రకారం 277లో కబ్జాలో ఉండగా, సర్వేనెం. 299 పట్టాదారు నక్షా ప్రకారం 285లో, సర్వే నెం.285 పట్టాదారు 279లో కబ్జాలో ఉన్నారు. నక్షా ప్రకారం ఒక సర్వే నంబర్ లో కొనసాగాల్సిన తాము మరో సర్వే నెంబర్‌లో ఉన్న విషయం ఇటీవల గుర్తించిన ఆ రైతులు తమ పొలాలను ఏ విధంగా కాపాడుకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే, ఇటీవల భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ఆ భూములపై కన్నేసిన కొందరు రియల్టర్లు... తరతరాలుగా కబ్జా ఉండి సాగు చేసుకుంటున్న రైతుల్లో ఒక్కొక్కరిని లక్ష్యంగా చేసుకుని వారి నుంచి ఏదో విధంగా ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తుండడంతో తరచూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. వివరాల్లోకి వెళితే ...వికారాబాద్ మండలం, సిద్దులూరు చించలంలో రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 279లోని 3.03 ఎకరాల్లో పట్టదారైన నాగమణి కుటుంబం తరతరాలుగా కబ్జాలో ఉంది. కాగా, రెండేళ్ల కిందట నాగమణి మృతి చెందగా, తల్లి పేరిట ఉన్న పొలాన్ని ఆమె కుమారులు బస్వలింగం, సిద్ధిలింగస్వామి, జ్యోతిర్లింగం తమ పేరిట విరాసత్ చేసుకుని అనుభవిస్తున్నారు. ఇదిలా ఉంటే, 2016, ఏప్రిల్ 11న గ్రామంలో సర్వే నెం277లో కావలి బందెయ్య పొలాన్ని బంటు సత్తయ్య కొనుగోలు చేసి తాను రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో బందెయ్య కబ్జాలో ఉన్న పొలం హద్దులు చూపకుండా సర్వే నెం 279లో అప్పటి పట్టాదారు నాగమణి సాగు చేస్తున్న పొలం హద్దులను చూపించాడు. తహసీల్దార్ కార్యాలయంలో పట్టామార్పిడికి దరఖాస్తు చేసుకున్న రోజే ఆయన పేరిట మ్యుటేషన్ కావడం గమనార్హం. నాగమణి పొలంలోకి తాను కబ్జాకు వెళితే లేనిపోని సమస్యలు వస్తాయని భావించిన సత్తయ్య ఆ పొలాన్ని ఆ హద్దులతోనే వేరే గ్రామానికి చెందిన రియల్టర్లకు రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ జరిగిన రోజే ఆ ముగ్గురు మ్యుటేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, అదేరోజు నోటీసు జారీ చేయించి, రెవెన్యూ రికార్డుల్లో కూడా వారి పేరిట మార్పు చేయించాడు. అనంతరం 2019, జూన్11న వీఆర్ఏ సత్తయ్య ఆ ముగ్గురిని వెంట బెట్టుకుని నాగమణి పొలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించే ప్రయత్నం చేశాడు. ఈ సంఘటనపై నాగమణి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వెనక్కి తగ్గారు. అంతే కాకుండా తమ భూమిలోకి దౌర్జన్యంగా వస్తున్నారంటూ ఆమె అప్పటి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా, నివేదిక అందజేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపిన తహసీల్దార్ 2019, జూలై నెలలో కలెక్టర్‌కు నివేదిక పంపించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉంది. ఇటీవల మరోసారి వారు సర్వేనెం 279 పట్టాదారుల పొలంలో కబ్జాకు వచ్చే ప్రయత్నం చేయగా, బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, అంతకు ముందు సత్తయ్య సర్వేనెంబర్ 271లో కావలి ఆనందం అనే వ్యక్తి వద్ద 0.24 గుంటల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో తాను కొనుగోలు చేసిన పొలం హద్దులు చూపకుండా 277లో బందయ్య కబ్జాలో ఉన్న పొలం హద్దులను చూపించడం గమనార్హం. ఈ విషయమై బందయ్య సత్తయ్యపై ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం కోర్టులో ఉండగానే 2016లో 277 సర్వే నెంబర్‌లోని బందయ్య పొలాన్ని కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో బందయ్య కబ్జాలో ఉన్న పొలం హద్దులు చూపకుండా సర్వేనెంబర్ 279లోని నాగమణి కబ్జాలో ఉన్న పొలం హద్దులు చూపించాడు. సర్వేనెంబర్ 271లో రెవెన్యూ రికార్డులు కలిగిన ఇతర భాగస్థులను కూడా మీకు బందయ్య కబ్జాలో ఉన్న పొలంలోనే ఉందని కబ్జా ఇప్పించి ఆయనతో న్యాయస్థానంలో కొనసాగుతున్న కేసులో 2017, అక్టోబర్‌లో రాజీ అయ్యారు. రికార్డుల్లోని లోపాలను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు తాను కొనుగోలు చేసే పొలం హద్దులు రాయకుండా వేరే సర్వే నెంబర్‌లోని పొలం హద్దులను పేర్కొంటూ గ్రామంలో రెవెన్యూ సమస్యలకు కారణమవుతున్నా, అధికారులు తమ ఉద్యోగిని వెనకేసుకు రావడం గమనార్హం.ఒకరి పేరుపై రెండు ఖాతాలు ఒక రైతుకు ఒక గ్రామంలో ఒకే ఖాతా, ఒకే పట్టా పాసు పుస్తకం ఉండాలి. అయితే ఆ గ్రామ వీఆర్వో సత్తయ్యకు రెండు ఖాతాలు ఉండడం గమనార్హం. సర్వే నెంబర్ 271లో సత్తయ్యకు మాన్యువల్ ఖాతా నెంబర్ 752 (రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక వ్యక్తికి వేర్వేరుగా ఎంత భూమి ఉంది.) ఉండగా, ఆన్‌లైన్‌లో ఖాతానెం 600 ఉంది. సర్వేనెంబర్ 277లో ఆయన పేరిట 955, 969 ఖాతాలు ఉండడం గమనార్హం. అధికారుల సహకారంతో తనకు అనుకూలంగా మార్చుకుని రైతులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. చేసేది వీఆర్ఏ ఉద్యోగమైనా... తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో అధికారులను మచ్చిక చేసుకుని తనకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చేలా చక్రం తిప్పుతుంటాడని ప్రచారంలో ఉంది. ఉన్నతాధికారులు స్పందించి, సిద్దులూరు చించలంలో రికార్డులకు మధ్య ఉన్న తప్పులను సరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలిసిద్దులూరు చించలంలో జ్యోతిలింగం కుటుంబ సభ్యులు సాగు చేస్తున్న పొలంలో వారు తాతల కాలం నుంచి కాస్తులో ఉన్నారు. ఇటీవల కంది పంట కూడా వేశారు. కాగా, సర్వే నెంబర్లు, నక్షకు పొంతన లేదనే విషయం ఇటీవల తెలిసింది. తాతల కాలం నుంచి ఈ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు నష్టం జరగకుండా అధికారులు పరిష్కరించాలి.-శెట్టి మల్లికార్జున్, కొటాలగూడ (సిద్దులూరు రెవెన్యూ) నా దృష్టికి రాలేదుసిద్దులూరు చించలంలో కొన్ని సర్వేనెంబర్లకు, నక్షకు పొంతన లేదనే విషయం నా దృష్టికి రాలేదు. పూర్తి వివరాలు తెప్పించుకుంటా. నిబంధనలకు లోబడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. - ఎస్.మోతీలాల్, అదనపు కలెక్టర్, వికారాబాద్

# పంచాయతీలకు భారంగా ట్రాక్టర్ల నిర్వహణ




మంచిర్యాల : పల్లెల్లో పారిశుద్ధ్యం నిర్వహణ, హరితహారం లో నాటిన మొక్కల సంరక్షణ కోసం ట్రాక్టర్లు కొనుగోలు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు చిన్న పంచాయతీలకు పెనుభారంగా మారాయి. ప్రతి నెలా అందించే నిధులన్నీ ట్రాక్టర్ల నిర్వహణ ఖర్చులు, రుణాల చెల్లింపులు, జీతభత్యాలకే సరిపోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలతో 2019లో ప్రభుత్వం ట్రాక్టర్లను కొనుగోలు చేయించింది. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను మూడేళ్లలో పూర్తిచేయాలనే నిబంధనలు పెట్టారు. నిధులు అందుబాటులో ఉన్న పంచాయతీలు పూర్తిగా డబ్బులు చెల్లించి ట్రాక్టర్లను కొనుగోలు చేయగా, ఆదాయం సక్రమంగా లేనివి బ్యాంకు రుణాలు తీసుకుని ట్రాక్టర్లు కొనుగోలు చేశాయి. వీటికి అదనంగా ట్రేలర్, నీటిట్యాంకులను కొనుగోలు చేయించారు. వీటి నిర్వహణ కోసం నెలనెలా పంచాయతీలకు అందించే నిధులను వినియోగించాలని ఆదేశించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ అనేక చిన్న పంచాయతీలకు ట్రాక్టర్ల రుణాలు, నిర్వహణ ఖర్చులు పెనుభారంగా మారుతుందని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు వాపోతున్నారు. తగ్గుతున్న వినియోగం..పంచాయతీల్లో ట్రాక్టర్లను వినియోగించి పారిశుద్ధ్య పనులు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల్లోని అనేక మారుమూల పంచాయతీల్లో నిధుల లేమి కారణంగా ట్రాక్టర్లను సక్రమంగా వినియోగించడం లేదు. ఇంధనం, మరమ్మతులకు నిధులు అందకపోవడంతో ట్రాక్టర్ల వినియోగం తగ్గింది. రిక్షాలను మాత్రమే ఉపయోగిస్తున్నారు. చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడంలేదు. హరితహారంలో నాటిన మొక్కలకు నీటిని పట్టేందుకు ట్రాక్టర్లను వినియోగించడంలేదు. మేజర్ పంచాయతీల్లో వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే ట్రాక్టర్ల ద్వారా ప్రధాన వీధుల్లోని చెత్తను తరలించి పనులు పూర్తిచేస్తున్నారు.

ఈ చిత్రం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం చిన్నగోపాల్‌పూర్ పంచాయతీ. 541 మంది జనాభా ఉండే ఈ గ్రామాన్ని ప్రభుత్వం కొత్తపంచాయతీగా ఏర్పాటు చేసింది. గ్రామంలోని జనాభా పూర్తిగా నిరుపేద కుటుంబాలకు చెందిన గిరిజనులే. ఏడాదంతా గ్రామంలో రూ.42 వేల పన్నులు మాత్రమే వసూలవుతాయి. 2019లో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ఈ పంచాయతీకి రూ.4 లక్షల బ్యాంకు రుణం తీసుకొని ట్రాక్టరును కొనుగోలు చేశారు. మరో రూ.6 లక్షలు వెచ్చించి ట్రాలీ, ట్యాంకరును కొనుగోలు చేశారు. నెలకు రూ.76 వేల నిధులను గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇందులో ప్రతి మూడు నెలలకు రూ.41 వేలు ట్రాక్టరు రుణం కిస్తుగా చెల్లిస్తుండగా, ప్రతి నెలా సిబ్బంది జీతభత్యాలు, ట్రాక్టరు ఇంధనం, పారిశుద్ధ్య ఖర్చులు, వీధిదీపాల ఖర్చులు, మరమ్మతులు, నర్సరీలు, మొక్కల సంరక్షణ, విద్యుత్ బిల్లులు, ఇతర అవసరాల కోసం నిధులు వెచ్చిస్తుండడంతో నిధులు సరిపోవడం లేదు. ట్రాక్టరుకు చిన్న చిన్న మరమ్మతులు వస్తే చేసేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

నిధుల కొరత లేదు... - నారాయణరావు, జిల్లా పంచాయతీ అధికారి, మంచిర్యాల.ప్రతి నెలా అన్ని పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన నిధులు చెల్లిస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు. ట్రాక్టర్ల ద్వారా అనేక పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్యలు మెరుగుపడ్డాయి. మొక్కల సంరక్షణ సక్రమంగా చేస్తున్నారు. నిధుల కొరత ఉన్నట్లు ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. సిబ్బంది జీతభత్యాలతో పాటు ట్రాక్టర్ల నిర్వహణ, మొక్కల సంరక్షణపై నిధుల ప్రభావమేమి లేదు. మూడేళ్లలో ట్రాక్టర్ల రుణాల చెల్లింపులు పూర్తయ్యే అవకాశం ఉన్నందున గ్రామాల అభివృద్ధి మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

# పుష్కరం సమీపం.. పనులు వేగవంతం

మంచిర్యాల : ప్రాణహిత పుష్కరాలకు మరో రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు పనులు ఊపందుకున్నాయి. కోటపల్లి మండలం అర్జునగుట్ట పుష్కరఘాట్‌కు భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని భావిస్తున్న అధికారులు తగు విధంగా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు తమ పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం సిమెంట్‌తో పూర్తిచేయగా క్యూరింగ్ చేపడుతున్నారు. తాగునీరు, ఇతర అవసరాల కోసం ప్రత్యేకంగా బోరు నిర్మాణం చేపట్టారు. మరోవైపు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్లపై మట్టిని తొలగించే పనులు ఊపందుకున్నాయి. నదిలో ఇనుప కంచె బిగింపు పనులు కొనసాగుతున్నాయి. పంచాయతీ ఆధ్వర్యంలో మట్టిరోడ్లపై దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో నీళ్లు చల్లుతున్నారు. విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు సంబంధిత శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# అప్పుడే 'పానీ'పాట్లు

రంగారెడ్డి : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అప్పుడే తాగునీటి తండ్లాట ప్రారంభమైంది. ఆందోళనలు కూడా షురూ అయ్యాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ కుళాయిలను ఏర్పాటు చేశారు. అయితే, నీటి సరఫరా మాత్రం జరగడం లేదు. చౌదరిగూడ, కేశంపేట మండలాల్లో నీటి సమస్య అధికంగా ఉంది. సింగిల్‌ఫేస్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుండటంతో ట్యాంకుల్లోకి నీరు చేరడం లేదు. ఫలితంగా బోరుబావుల మీదనే ఆధారపడాల్సి వస్తుంది. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 18వేల గృహాలున్నాయి. వాటిలో 6,442 మిషన్ భగీరథ కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. ప్రభుత్వం మరో 8వేల ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేందుకు అనుమతి ఇచ్చినా కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. మిగతా వాటికి కనెక్షన్లు ఇవ్వాలంటే కనీసం ఏడాదిన్నర సమయం పట్టేలా ఉంది. కేశంపేట మండలంలోని శివారు గ్రామాలైన మంగళిబావి తండా, గాంధీ శంకర్‌పల్లి, నానుతండా, రంగంపల్లి, తుర్కలపల్లి, తెట్టెకుంట తండాలకు భగీరథ నీరు సరిగా సరఫరా కావడం లేదు. ఇక్కడ రెండు పూటలకు బదులు ఒకపూటే నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో కుటుంబాలకు నీరు సరిపోవడం లేదు. లేమామిడి గ్రామంలో భగీరథ నీరు సరిపోక గ్రామ పంచాయతీ బోర్ల ద్వారా భగీరథ ట్యాంకులకు నీటిని ఎక్కించి ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోకవర్గంలో మిషన్ భగీరథ కింద తాగునీరు అందిస్తున్నా వేసవి తీవ్రతతో అక్కడక్కడ తాగునీటి కొంత కటకటగా ఉంది. యాచారం మండలం నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాలు ఎత్తైన ప్రదేశంలో ఉన్నాయి. దీంతో వాటికి నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్ ద్వారా సరిపడా నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. మేడిపల్లిలో కొంతభాగం సమస్యను ఎదుర్కొంటోంది. నల్లాల బిగింపు సమయంలో కొందరు లోపాలున్న చెర్రాలు తీసివేయడంతో వీరికే నీరొస్తోంది. మిగిలిన వారికి నీరు రావడం లేదు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మిషన్ భగీరథ కింద పనులు 95 శాతమే పూర్తయ్యాయి. మున్సిపాలిటీలోని బృందావన్ కాలనీలో ఇప్పటికీ ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేస్తున్నారు. తాండూరు నియోజకవర్గంలో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు పాత ఆర్‌డబ్ల్యూఎస్ నీటి ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు. యాలాల మండలం అన్నసాగర్ గ్రామంలో మిషన్ భగీరథ పథకం అందుబాటులో లేదు. రాజకీయాల కారణంగా ఈ గ్రామంలో మిషన్ భగీరథ నిర్మాణం జరగలేదు. దీంతో గ్రామస్తులు పాత ఓహెచ్‌ఎస్ ట్యాంకు ద్వారా, బోరు, బావుల ద్వారా తాగునీటిని వాడుకుంటున్నారు. పెద్దేముల్‌లో మాత్రం ఒక వార్డులో మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వలేదు. పరిగి నియోజకవర్గం దోమ మండలంలోని పోతిరెడ్డిపల్లి, ఊటుపల్లితండా, పాశంబండ తండా, పూడూరు మండలం తీర్మాలాపూర్ గ్రామాలు ఎత్తైన ప్రాంతాల్లో ఉండడంతో వాటికి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. కులకచర్ల మండలం తిర్మలాపూర్, ఇప్పాయిపల్లి, రాంపూర్, కుసుమసంద్రం, ముజాహిద్‌పూర్, బొంరెడ్డిపల్లి, ఎర్రగొవింద్ తండాలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పరిగి మున్సిపాలిటీలోని తిరుమల రెసిడెన్సీ, భవానీనగర్, అనంతనగర్, మైత్రీనగర్, అనురాగ్‌కాలనీ, అనంతంకాలనీ, వెంకటేశ్వరకాలనీ చివర ఉన్న అన్ని కాలనీలు, సుల్తాన్‌నగర్ వెళ్లే దారిలోని కాలనీల్లో నీటి సరఫరాకు పైపులైన్లే వేయలేదు. ఇక్కడ జనం బోరు నీటినే తాగుతున్నారు. మల్లెమోనిగూడలో వారం క్రితం కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అయితే మున్సిపల్ అధికారులు నీటి సమస్య ఉన్న కాలనీల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గం మర్పల్లిలో మిషన్ భగీరథ పనులు పూర్తికాక పోవడంతో నీటి సరఫరా జరగడం లేదు. మండలంలో 27 పంచాయతీలకు గాను 10 పంచాయతీల్లో మిషన్ భగీరథ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. పూర్తయిన పంచాయతీల్లో కూడా పూర్తిస్థాయిలో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. వికారాబాద్ మునిసిపాలిటీలో రోజుకు 10.5ఎంఎల్‌డీ నీరు అవసరం. అయితే, ఇప్పుడు రెండు రోజులకు కలిపి 10.9 ఎంఎల్‌డీ నీటిని అందిస్తున్నారు. దీంతో ప్రజలకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. వికారాబాద్ మునిసిపాలిటీలో మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నా విద్యుత్, ఇతర సమస్యలతో ఆ నీరు రాకపోతే ప్రత్యామ్నాయం కరువైంది. ప్రస్తుతం మునిసిపాలిటీలో 3 ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నా అవి సరిపోవడం లేదు. శివసాగర్ చెరువు నిండా నీరున్నా ప్రజలకు అందించడం లేదు. కొడంగల్ నియోజకవర్గం బొంరాసపేట మండలంలోని నాలుగు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదు. మేడ్చల్ నియోజకవర్గం దమ్మాయిగూడ ఇందిరానగర్‌లో జలమండలి వేసిన పైపుల నుంచి వచ్చే నీరు ప్రజలకు సరిపోవడం లేదు. దీంతో మున్సిపాలిటీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

నీటి సరఫరా తగ్గింపు

భూగర్భ జలాలు అడుగంటడంతో మిషన్ భగీరథ నీటి సరఫరాను కూడా తగ్గించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో గతంలో రోజుకు రెండు గంటల పాటు నీరిచ్చేవారు. ఇప్పుడు దానిని 40 నిమిషాలకు తగ్గించారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లోని అన్ని గ్రామాల్లో నీటి సరఫరా సమయాన్ని తగ్గించారు. ఇంతకు ముందు రోజుకు రెండు గంటలు నీరిచ్చేవారు. ఇప్పుడు ఆ సమయాన్ని అరగంట తగ్గించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని కాచవాని సింగారంలో కేవలం అరగంట మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. మండుతున్న ఎండలతో నీరు సరిపోక జనం నానా అవస్థలు పడుతున్నారు.

కలవరపెడుతున్న విద్యుత్ సమస్య

తాండూరు నియోజకవర్గంలో తాగునీటి సరఫరాకు విద్యుత్ సమస్య కూడా తోడైంది. నీటి సరఫరా సమయంలో విద్యుత్ పోవడంతో సరఫరా బంద్ అవుతోంది. ఈ సమస్యతో తరచూ మోటార్లు కాలిపోతున్నాయి. వాటిని తిరిగి మరమ్మతు చేయించేవరకు నీటి సరఫరా ఉండడం లేదు. ఈ సమయంలో ప్రజలు ట్యాంకర్లు, వ్యవసాయ బావులు, బోర్లపైనే ఆధారపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో బోర్ల నుంచి వచ్చేది ఉప్పునీరైనా వాటిని వేడి చేసుకొని చల్లార్చి తాగుతున్నారు. బోరు మోటార్ల మరమ్మతులకు స్థానిక సర్పంచులు తమ సొంత డబ్బులే వెచ్చించాల్సి వస్తోంది. వాటిని తిరిగి చెల్లించడంలో ప్రభుత్వం అలసత్వాన్ని ప్రదర్శిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బిల్లుల కోసం చెప్పులరిగేలా..

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం లింగందన గ్రామంలో మిషన్ భగీరథ అంతర్గత పైప్‌లైన్ వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో అప్పటి సర్పంచ్ మయూరి తన సొంత డబ్బులు రూ.5లక్షలు వెచ్చించి ఓ కాంట్రాక్టర్‌తో పనులు చేయించారు. పనులు పూర్తయ్యేనాటికి ప్రభుత్వం రూ.2లక్షలు మాత్రమే చెల్లించింది. ప్రస్తుతం ఆ సర్పంచ్ కరోనాతో మరణించింది. మిగతా డబ్బుల కోసం ఆమె భర్త మధుసూదన్‌గౌడ్ ఏడాదిన్నర కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా డబ్బులు మాత్రం ఇవ్వడం లేదు. తన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, తన భార్య కూడా మరణించిందని, తన డబ్బులు ఇవ్వాలని వేడుకుంటున్నా అధికారులు కనికరించడం లేదని మధుసూదన్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఆరు నెలలుగా నీళ్లు రావడం లేదు : - శ్రీనివాస్, పులుమద్ది

మా గ్రామంలో దాదాపు 6 నెలలుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ఎప్పుడో ఒకసారి వచ్చినా 2 లేదా 3 కడువల నీరు మాత్రమే వస్తుంది. ఈ విషయం అనేకసార్లు సర్పంచ్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. గ్రామంలో నీటికోసం సింగిల్ ఫేస్ మోటార్‌లపై ఆధారపడడంతో పంచాయతీ ఆదాయం మొత్తం కరెంట్ బిల్లులకే సరిపోతుంది. అంతేకాకుండా ప్రజలపై భారం పడుతుంది. కావున గ్రామంలో మిషన్ భగీరథ నీటి సమస్యను పరిష్కరించాలి.

నీళ్లు కొనుక్కొంటున్నం.. : సంయుక్త, బృందావన్ కాలనీ, ఇబ్రహీంపట్నం కొన్నాళ్లుగా నీరు కొని తాగుతున్నం. మున్సిపల్ నీరు సరఫరా సరిగాలేదు.. మిషన్ భగీరథ పనులు పూర్తికాక నీటికి ఇబ్బంది పడుతున్నం. తాగునీరే కాదు.. వాడుకోవడానికీ ట్యాంకరుకు రూ.500కు నీరు కొంటున్నం.

# ఒంటిమిట్ట కోదండరామ ఆలయంలో కీలక ఘట్టం ఆరంభం

కడప: ఆంధ్రా భద్రాచలంగా పేరుగాంచిన ఒంటిమిట్ట శ్రీకోదం దరామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్స వాల్లో కీలక ఘట్టమైన ధ్వజారోహణం శుక్రవారం ఉ దయం ప్రారంభమైంది. ధ్వజారోహణ కార్యక్రమాన్ని టీటీడీ, ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ధ్వజారోహణ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ప్రము ఖులు పాల్గొన్నారు. కాగా.. నిన్న సాయంత్రం కోదండరామస్వామి ఆలయం లో బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం సుప్రభాత సేవ అనంతరం పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహిం చారు. మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం అర్చకుల వేదమంత్రాల నడుమ అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి కంకణధారణ



చేశారు. అయితే దేశ్యాప్తంగా శ్రీరామనవి రోజు శ్రీసీతారాముల కళ్యాణం జరుగుతుండగా.. ఇక్కడ మాత్రం చైత్ర పౌర్ణమి రోజు కళ్యాణవేడుక జరుగుతుంది. ఏప్రిల్ 5న కోదండరామ స్వామి ఆలయంలో శ్రీసీతారాముల కళ్యాణం జరుగనుంది. ఇందుకు కోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# అమరావతి రాజధాని రైతులకు కోటంరెడ్డి సహా పలువురి సంఘీభావం





అమరావతి: రాజధాని అమరావతి కోసం రైతులు చేపట్టిన ఉద్యమం నేటితో 1200 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అమరా వతి రైతులు, మహిళలకు వివిధ రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం ప్రకటించారు. ప్రస్తుతం మందడంతో రాజధాని రైతల ఆందోళన కొనసాగుతోంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్య కుమార్, మాజీ మంత్రి అది నారాయణ రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్ర రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, టీడీపీ నుండి మాజీ మంత్రి కన్నా లక్ష్మినారా యణ, , ఎమ్మెల్సీ పంచుమార్తి అనురాధ మందడంలోని రైతుల దీక్షా శిబిరానికి చేరుకుని రైతుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎన్నికలలో ఓటమి తరువాత అయినా ముఖ్యమంత్రి కళ్ళు తెరుచుకోడం లేదని విమర్శించారు. అమరావతి మహిళలు పాదయాత్రకు వెళితే ఈ ప్రభుత్వం టాయిలెట్‌ను తీసుకెళ్లిపోయి.. ఇబ్బందులకు గురిచేసిందన్నారు. మహిళలను అనేక ఇబ్బందులు పాలు చేయడంతో వారి రూపు కూడా మారిపోయిందన్నారు. అమరావ తికి ప్రతి టీడీపీ కార్యకర్త మద్దతుగా ఉంటారని స్పష్టం చేశారు.

**అమరావతికి కాంగ్రెస్ కట్టుబి ఉంది: గిడుగు రుద్రరాజు –** కాంగ్రెస్ పార్టీ అమరావతికి కట్టుబడి ఉంటుంది అని రాహుల్ గాంధీ చెప్పారని ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్ర రాజు అన్నారు. ఉద్యమానికి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ ఆది నుంచి అందుబాటులో ఉ న్నారని తెలిపారు. అమరావతికి రాష్ట్ర కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**అమరావతిని నిలబెట్టుకుని తీరుతాం: సుంకర –** అమరావతి కోసం 34 వేల ఎకరాలు, 29 గ్రామాలు, ఐదుకోట్ల ప్రజల కోసం త్యాగం చేశారన్నారు. అమరావతి స్కాం కాదు అని సుప్రీంకోర్టులో నిరూపణ అయినా రాజకీయ లబ్ది కోసం రైతు చేత కంట కన్నీరు తెప్పిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి సిగ్గు లేకుండా పరదాల చాటున వెళుతున్నారని విమర్శించారు. 1200 రోజులుగా వందలాది కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. అమరావతిని నిలబెట్టుకుని తీరుతామని స్పష్టం చేశారు. వైసీపీ నేతలే అమరావతి ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నారన్నారు. కోటంరెడ్డి శ్రీదర్ రెడ్డి ఒక్కరూ మనకు తుఫానులో అండగా నిలబడ్డారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా అన్యాయం చేస్తున్నాయని... అందుకే వారిని హెచ్చరిస్తున్నామని అన్నారు. ప్రధాని స్వయంగా శంకుస్థాపన చేసిన ప్రాంతమిదని... కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం ఇక్కడ కేంద్ర సంస్థలకు శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ అమరావతి రాజదాని అండగా ఉంటాం అని చెప్పారని పేర్కొన్నారు.

# పోలవరం ప్రాజెక్టును అడ్డుకుంది ఆయనే...

ఢిల్లీ: ఏపీలో ఇసుకాసురా వైభవము.. ఇసుకను ఇష్టానుసారంగా అమ్ముకుంటూ, దోచుకుంటున్నారని నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ఇసుకపైన ఏడాదికి రూ. 1050 కోట్లు ఆర్జిస్తున్నారని.. ఆ భారం ప్రజలపై పడుతుందన్నారు. ఇసుక, మట్టిగుట్టలుగా ఎక్కడ ఉన్నా తవ్వుకుపోతున్నారని.. అమరావతిలో ఇసుక వ్యాపారం ఎవరెవరు చేస్తున్నారో తెలుస్తుందని.. ముఖ్యమంత్రి దగ్గర వ్యక్తే ఉన్నారని... విచారణకు ఆదేశిస్తారా? అని ప్రశ్నించారు. ఇసుక దోచుకో, అమ్ముకో అనే విధంగా ఉందని, వైసీపీ వాళ్లకు కొత్త ఆలోచనలు వస్తుంటాయని రఘురామ అన్నారు. సీఎం జగన్‌కు అమావాస్యకు ఒకసారి పోలవరం, ప్రత్యేక హెూదా గుర్తుకు వస్తుంటాయని ఎద్దేవా చేశారు. అమిత్ షా ను అర్ధరాత్రి కలిశారని.. అందులో అవినాష్ రెడ్డి అంశమే ఉంటుందని అనుకుంటున్నారన్నారు. ఏదో కోర్టులో వెసులుబాటు దొరికిందని.. కానీ కోర్టులో సీబీఐ




నెలరోజుల్లో విచారణ పూర్తి చేస్తామని చెప్పిందన్నారు. నిన్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం జగన్ కలిసి ఒక వేంకటేశ్వర ఫోటో, శాలువా ఇచ్చారన్నారు. పోలవరంపై కేంద్రానికి లేఖ రాసింది జగన్ అని.. నడుస్తున్న ప్రాజెక్ట్‌ను అడ్డుకుంది ఆయనేనని... లేఖ రాయలేదని జగన్ గుండెపై చేయి వేసుకుని చెప్పాలన్నారు.

# ‘జగన్‌వి అన్నీ ఉత్తరకుమార ప్రగల్భాలే’



అమరావతి: రాజధాని అమరావతి కోసం రైతులు చేపట్టిన ఉద్యమం 1200 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ.. రైతుల దీక్షా శిబిరానికి చేరుకుని రైతుల ఉ ద్యమానికి సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ... ప్రస్తుత అధికార పార్టీ తప్ప అన్ని పార్టీలు అమరావతి కోరుకుంటున్నారన్నారు. ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిన జగన్ రాష్ట్ర భవిష్యత్తును కట్ట గట్టి కృష్ణాలో పారేశారని విమర్శించారు. జగన్‌కు మూడు రాజధానులు కట్టాలని లేదని... కేవలం దేశంలోనే అత్యంత ధనికుడు అయిన నాయకుడు కావాలని... దానికి ఉదాహరణ ఇసుక పాలసి, రాజధాని అని చెప్పుకొచ్చారు. విశాఖ వడ్డించిన విస్తరిలా ఉందని... లా వుంది దోచుకోవడానికే విశాఖ రాజధాని అంటున్నారని మండిపడ్డారు. “గతంలో విజయనగరం వెళ్లిన సమయంలో మీ ప్రాంతానికి రాజధాని వస్తుందని చెప్పగా.. వాళ్ళు మాకు ఈ దోపిడీ తెచ్చే రాజదాని వద్దు అన్నారు” అని టీడీపీ నేత తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఇది నిరూపించారన్నారు. జగన్ సంక్షేమ కార్యక్రమం అంతా బూటకమన్నారు. ఇచ్చేది చాక్లెట్... ఎత్తుకెళ్లేది నక్లెస్ అంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ కార్యకర్తలు నాలుగేళ్లలో అసంతృప్తితో ఇళ్లకు పరిమితం అయ్యారన్నారు. అయితే పోలీసులు మాత్రం వాళ్ళకంటే ఎక్కువ ఉ త్సాహం చూపుతున్నారని మండిపడ్డారు. జగన్‌ను రాష్ట్ర ప్రజలు తరిమి తరిమి కొట్టే రోజు ముందుందన్నారు. మూడు రాజధానులు అన్న రోజు... చీపురు పుల్ల కూడా జగన్ అమరావతి నుంచి తీసుకెళ్లలేరని చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలో అమరావతి అభివృద్ధి చెందుతుందని కన్నా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు.

# లోకేష్‌ను చూసేందుకు భారీగా రోడ్లపైకి వచ్చిన మహిళలు



శ్రీసత్యసాయి జిల్లా: టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 56వ రోజుకు చేరుకుంది. శుక్రవారం ఉదయం రాప్తాడు నియోజకవర్గం సీకేపల్లి చేరుకున్న లోకేష్‌ను టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. లోకేష్‌ను చూసేందుకు సీకేపల్లి మహిళలు, యువత, వృద్ధులు భారీగా రోడ్లపైకి వచ్చారు. అందరినీ కలుస్తూ వారి సమస్యలు యువనేత తెలుసుకుంటున్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి అంటూ ఈ సందర్భంగా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పన్నుల భారం తగ్గిస్తామంటూ హామీ ఇచ్చారు. కరెంట్ బిల్లు ఎక్కువొచ్చిందని, పెన్షన్లు కట్ చేశారని పలువురు వృద్ధులు ఆవేదన చెందారు. “మీ పెన్షన్లే కాదు రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల మంది పెన్షన్లు కట్ చేశారు. మరో ఆరు లక్షల పెన్షన్లు లేపేయడానికి జగన్ ప్రభుత్వం సిద్ధం అవుతుంది. అర్హులైన అందరికీ టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పెన్షన్లు అందజేస్తాం” అని లోకేష్ భరోసా ఇచ్చారు. చిరు వ్యాపారులతో మాట్లాడి వారు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం అంటూ లోకేష్ హామీ ఇస్తూ ముందుకు సాగుతున్నారు. కాగా.. నిన్న 55వ రోజు పాదయాత్రలో గుట్టూరు వద్ద 700 కిలోమీటర్ల మైలురాయిని లోకేష్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతాల తాగు,సాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి టీడీపీ ప్రభుత్వం వచ్చాక హంద్రీనీవా కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అక్కడ శిలాఫలకం ఏర్పాటు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు కృషితో రాష్ట్రానికి వచ్చిన కియా కార్ల ఫ్యాక్టరీ ఎదుట సెల్ఫీ దిగారు. కియా ఫ్యాక్టరీ వద్ద ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడారు. కియా పరిశ్రమ ముందు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. అమ్మనపల్లి వద్ద స్థానికులతో మాటామంతి నిర్వహించారు. గుట్టూరు హైవే సమీపంలో కుంచిటిగ వక్కలిగ సామాజికవర్గీయులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. సీకేపల్లి పంచాయతీ కోన క్రాస్ వద్ద పాదయాత్ర రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశించగా లోకేష్‌కు నేతలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు.




న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అపఖ్యాతి మూటగట్టుకున్నారు. అగ్రరాజ్య చరిత్రలోనే తనపై వచ్చిన నేరారోపణలకు క్రిమినల్ ఛార్జ్‌లను ఎదుర్కోనున్న తొలి మాజీ అధ్యక్షుడిగా నిలిచారు. తనతో లైంగిక సంబంధాలున్నాయని ఆరోపించిన మహిళను డబ్బుతో ప్రలోభపెట్టినట్లు ట్రంప్‌పై ఆరోపణలు రాగా..దానిపై తాజాగా న్యూయార్క్ గ్రాండ్ జ్యూరీ వాటిని ధ్రువీకరించి ఆయనపై అభియోగాలు మోపింది. దీంతో ఆయన ఇప్పుడు క్రిమినల్ ఛార్జ్‌లను ఎదుర్కోనున్నారు. ట్రంప్ లొంగుబాటుపై మన్‌హట్టన్ జిల్లా అటార్నీ.. ఆయన న్యాయవాదులతో చర్చించారు. ట్రంప్ లొంగిపోతే సుప్రీంకోర్టులో హాజరుపర్చే అవకాశాలున్నాయి.

ప్రస్తుతం ఫ్లోరిడాలో ఉన్న ట్రంప్.. వచ్చే సోమవారం న్యూయార్క్ వెళ్లనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఆయన మన్‌హట్టన్ కోర్టులో హాజరయ్యే అవకాశాలున్నాయి. 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారం సమయంలో స్టోర్మీ డానియల్స్ అనే పోర్న్‌స్టార్‌తో తనకున్న శారీరక సంబంధం బయటపడకుండా ఆమెకు డబ్బు ఇచ్చి అనైతిక ఒప్పందం (నాన్–డిజ్‌క్లోజర్ అగ్రిమెంట్) చేసుకున్నారనే ఆరోపణలను ట్రంప్ ఎదుర్కొంటున్నారు. అయితే ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలంటూ సదరు మహిళ రెండేళ్ల తర్వాత కోర్టును ఆశ్రయించింది. అయితే, ట్రంప్ ఈ ఆరోపణలను ఖండించారు. తాను ఏ తప్పూ చేయలేదని, తన 2024 అధ్యక్ష అభ్యర్థిత్వ ప్రచారాన్ని నీరుగార్చేందుకే ‘డెమొక్రాటిక్’ప్రాసిక్యూటర్ ద్వారా తప్పుడు విచారణ చేయిస్తోందని ఆరోపించారు. ఈ కేసు విచారణ జరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే తనను అరెస్టు చేసే అవకాశం ఉందని ట్రంప్ ఇటీవల అనుమానం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఒకవేళ తాను అరెస్టయితే పెద్ద ఎత్తున నిరసనలు తెలపపాలని రిపబ్లికన్ పార్టీ శ్రేణులకు ఆయన పిలువునివ్వడం గమనార్హం. ఈ కేసులో ట్రంప్ అరెస్టవుతారా..? లేదా..? అనేది తెలియాల్సి ఉంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రెండుసార్లు అభిశంసనను చవిచూశారు. క్యాపిటల్ హిల్‌పై దాడి చేసేలా తన మద్దతుదారులను రెచ్చగొట్టారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అలాగే అధికారంలో ఉన్న సమయంలో కీలక పత్రాలు మిస్సింగ్ వంటి తదితర విషయాల్లో ట్రంప్ అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఇక అనైతిక ఒప్పందం కేసులో ఆయన అరెస్టయితే తన రాజకీయ చరిత్రలో అదొక మచ్చగా మిగులుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




ఇండోర్: మధ్యప్రదేశ్‌లో నవమి వేడుక పెను విషాదాన్ని మిగిల్చింది. ఆలయంలో మెట్లబావి పైకప్పు కూలిన దుర్ఘటనలో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 35 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. గల్లంతైన మరో వ్యక్తి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇండోర్ లోని బేలేశ్వర్ మహదేవ్ ఝులేలాల్ ఆలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకల్లో ఈ ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. పటేల్ నగర్ ప్రాంతంలో ఉన్న ఈ పురాతన ఆలయంలో రామనవమి ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో రద్దీ పెరిగింది.


స్థలాభావం కారణంగా వేడుకలను చూసేందుకు కొందరు భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న మెట్లబావి కప్పుపై కూర్చున్నారు. దీంతో బావి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయి ఘోరం జరిగింది. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. ఈ ప్రమాదంలో 50 మందికి పైగా బావిలో పడిపోయారు. 16 మందిని సహాయక సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఇప్పటివరకు 35 మంది మృతదేహాలను బావి నుంచి వెలికి తీశామని ఇండోర్ జిల్లా కలెక్టర్ డా. ఇళయరాజా మీడియాకు వెల్లడించారు. ఓ వ్యక్తి గల్లంతైనట్లు తెలిపారు.
ఆ వ్యక్తి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొ న్నారు. ఈ ఆలయం ఉన్న భూమిలో పురాతన కాలం నుంచి ఓ మెట్లబావి ఉంది. అయితే దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం ఆ బా విని మూసేశారు. అయితే జాగ్రత్తలు తీసుకోకుండా కేవలం పైన శ్లాబుతో ఫ్లోరింగ్ చేసి.. ఆలయాన్ని నిర్మించారు. ఆ విషయం తెలియక చాలా మంది బావి ఉన్న ప్రాంతంలో కూర్చునేసరికి బరువు మోయలేక.. నేల కుంగిపోయి ఈ దుర్ఘటన చోటుచేసుకుందని స్థానిక అధికారులు వెల్లడించారు. బావి లోతు దాదాపు 50 అడుగులు ఉన్నట్లు తెలుస్తోంది.




గుంటూరు : తెలుగు రాష్ట్రాల్లోని ప్రయాణికులు తిరుపతి పుణ్యక్షేత్రానికి అత్యంత వేగంగా చేరుకునేందుకు వందేభారత్ రైలు అందుబాటులోకి వస్తోంది. ఏప్రిల్ 9న తిరుపతి నుంచి, 10న సికింద్రాబాద్ నుంచి వందేభారత్ పరుగులు పెట్టనుంది.

ఈ రైలు మంగళవారం మినహా ప్రతి రోజూ తిరుగుతుంది. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి ప్రయాణ సమయం 8.30 గంటలు. ఛార్జీల వివరాలను రైల్వే శాఖ ప్రకటించాల్సి ఉంది. ఏప్రిల్ 8న సికింద్రాబాద్‌లో రైలును ప్రారంభిస్తున్నప్పటికీ ఆ రోజు ప్రయాణికులను అనుమతించబోరు. ఆ రోజు సికింద్రాబాద్‌లో 11.30 గంటలకు ప్రారంభమై తిరుపతి 21.00 గంటలకు చేరుతుంది. గురువారం అధికారికంగా ప్రకటించిన ప్రయాణ సమయాలివి. సికింద్రాబాద్–తిరుపతి (20701): సికింద్రాబాద్ ఉదయం 6.00, నల్గొండ 07.19, గుంటూరు 09.45, ఒంగోలు 11.09, నెల్లూరు 12.29, తిరుపతి 14.30. తిరుపతి–సికింద్రాబాద్(20702): తిరుపతి మధ్యాహ్నం 15.15, నెల్లూరు 17.20, ఒంగోలు 18.30, గుంటూరు 19.45, నల్గొండ 22.10, సికింద్రాబాద్ 23.45.

# ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి అస్వస్థత



ఆత్మకూరు: వైకాపా నుంచి సస్పెండైన నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. మర్రిపాడులోని తన నివాసంలో ఉండగా గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు వైద్యులను రప్పించారు. ఇంట్లోనే ఆయనకు చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యేను చెన్నై తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెలలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి గుండెపోటు వచ్చింది. అప్పుడు రెండు వాల్వులు బ్లాక్ అయినట్లు వైద్యులు గుర్తించి చికిత్స అందించడంతో ఆయన కోలుకున్నారు. 2021 డిసెంబర్‌లో చంద్రశేఖర్‌రెడ్డికి గుండెపోటు రావడంతో బెంగళూరులో సర్జరీ చేసి స్టెంట్ వేశారు.

# అమరావతి రైతులను సీఎం జగన్ వంచించారు..

విశాఖ : అమరావతి రైతుల ఉద్యమానికి బీజేపీ రాష్ట ఉ పాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ అమరావతి రైతులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వంచించారని...దారుణంగా మోసం చేశారని విమర్శించారు. రైతులపై పెట్టిన కేసులు బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మళ్లీ జగన్ గెలిస్తే.. రాష్ట్రం ఎడారి అవుతుందన్నారు. వైసీపీ నేతలు విశాఖలో విలువైన ఆస్తులు దోచుకోవడానికే పరిపాలన రాజధాని అంటున్నారని ఆరోపించారు. అమరావతే రాష్ట్రానికి ఏకైక రాజధాని అని.. ఇదే బీజేపీ విధానమని, మూడు రాజధానులకు బీజేపీ మద్దతులేదని విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు. కాగా అమరావతి రైతులు చేపట్టిన ఉద్యమం 1200 రోజులు గడిచాయి. రైతులు తమ భూమిని అమరావతి రాజధాని కోసం ఇచ్చారు. దాన్ని సీఎం జగన్ నిర్వీర్యం చేస్తుంటే తట్టుకోలేక రోడ్ల మీదకు వచ్చారు. అవిశ్రాంతంగా




పోరాడుతున్నారు. భూములు ఇచ్చి మరీ రోడ్డున పడ్డా.. మొక్కవోని పట్టుదలతో పోరాడుతున్నారు. కరోనా.. ప్రభుత్వ నిర్బంధాలు వారిని ఏమీ చేయలేకపోయాయి. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు రైతుల ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నారు.

ఓ వైపు ఉద్యమం చేస్తూ.. రాజధానిని నిర్వీర్యం చేయడానికి జగన్ ప్రభుత్వం మూడు రాజధానులంటూ కుట్ర చేస్తోంది.

# వయ్యారాల వేదిక నడుము నాభి అందం చూడతరమా..!

నందమూరి కల్యాణ్ రామ్ తో కలిసి విజయ దశమి సినిమా లో నటించిన వేదిక అందాల గురించి అందరికీ తెలిసిందే. సినిమా పెద్దగా ఆడకపోయినప్పటికీ ఆమె అందంతో వేలాది మంది అభిమానులను సొంతం చేసుకుంది. అంతే కాదండోయ్ వరుస సినిమా ఆఫర్లను కూడా దక్కించుకుందీ ముద్దుగుమ్మ. తెలుగులోనే కాకుండా తమిళ్ మలయాల కన్నడ చిత్రాల్లో నటిస్తూ దూసుకెళ్తోంది. మూడు పదుల వయసులోనూ పదహారేళ్ల పడుచు పిల్లలా కనిపిస్తూ.. కుర్రకారును కవ్విస్తుంటుంది. తెలుగులో చివరగా బాలయ్య బాబు సినిమా రూలర్ లో నటించింది. అందులోనూ పెద్దగా మెప్పించలేకపోయింది. కానీ తనను అభిమానించే వాళ్లకు సోషల్ మీడియా అకౌంట్ల



ద్వారా ఎప్పుడూ దగ్గరగానే ఉంటుంది. తనకు సంబంధించిన సినిమా అప్ డేట్లతో పాటు తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను కూడా అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. అప్పుడప్పుడూ ఫొటో షూట్ లు చేసి.. తన అందమైన ఫొటోలను నెట్టింట వదులుతుంది. అందులో ఈ హాట్ బ్యూటీని చూసిన కుర్రకారుకు ఫీవర్ రావడం పిచ్చెక్కిపోవడం కామన్ అయిపోయాయి. అయితే తాజాగా ఈమె ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఓ మూడు ఫొటోలను షేర్ చేసింది. అందులో బ్లాక్ డ్రెస్ లో కనిపిస్తున్న ఈ హాట్ బ్యూటీ తన వయ్యారాల నడుముతో పాటు ఒంపుసొంపులన్నీ ఒలకబోసింది. అందమైన నాభి అందాన్ని చూపిస్తూ కుర్రకారుకు పిచ్చెక్కిస్తోంది. స్లీవ్ లెస్ టాప్ చిన్న బ్లాక్ కలర్ మిడ్డీ వేసుకొని చేతులు మొత్తం పైకి లేప అందాలను ఆరబోసింది. ఎద అందాలను ఓపెన్ గా చూపించకపోయినా ఎత్తెత్తి చూపిస్తోంది. బ్లాక్ డ్రెస్ లో మిలమిలా మెరిసిపోతోందీ ముద్దుగుమ్మ. సూర్య కిరణాలన్నీ ఆమె అందాలపై పడడంతో చూసేందుకు మరింత హాట్ గా కనిపిస్తోంది. ఈ ఫొటోలను చూసిన అభిమానులు తమదైన స్టైల్ లో కామెంట్లు చేస్తున్నారు. బ్లాక్ డ్రెస్ లో చాలా హాట్ దా ఉన్నావ్ క్యూటీ అంటూ కొందరు నిన్న నీ అందాన్ని చూసి తట్టుకోలేక పోతున్నామంటూ మరికొందరు కామెంట్లు చేస్తున్నారు. ఆమె ఫొటోలు నెట్టింట షేర్ చేసిన గంటలోపే వేలల్లో లైకులు వందల్లో కామెంట్లు వచ్చాయి. ఒక్క ఇన్ స్టాగ్రామ్ లోనే 3.7 మిలియన్ల ఫాలోవర్ల ను కల్గిన ఈ బ్యూటీ 1831 పోస్టులను షేర్ చేసింది ఇప్పటి వరకు.

# చక్కనైన సీతమ్మ.. చీరకట్టులో ముద్దుగా..

మృణాల్ ఠాకూర్.. అంటే గుర్తు పట్టక పోవచ్చు కానీ... సీతారామం సీత అంటే వెంటనే గుర్తు పడతారు. ఆ ఒక్క సినిమాతో తెలుగు ప్రేక్షకులకే కాదు... దేశవ్యాప్తంగా అందరికి హాట్ ఫేవరెట్గా మారిపోయింది ఈ సిల్వర్ స్క్రీన్ సీత. సీతారామం సినిమాతో తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈ బ్యూటీ... తెర మీద ఎంత ట్రెడిషనల్గా కనిపించారో తెలిసిందే. రియల్ లైఫ్లోనూ అంతే బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. తాజాగా ఆమె ఇన్ స్టా గ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. అచ్చమైన తెలుగమ్మాయిలా.. చీరలో మెరిసింది ఈ భామ. పింక్ కలర్ సారీ కట్టుకుని.. దానికి తగ్గట్లుగా జ్యూవెలరి వేసుకుని క్యూట్ లుక్స్ తో జనాలను ఆకట్టుకునేలా ఉంది. చూడగానే అచ్చం తెలుగమ్మాయిలా మెరిసింది ఈ భామ. ఇక ఈ ఫోటోలు షేర్ చేస్తూ... సారి లవ్ అంటూ క్యాప్షన్ రాసుకొచ్చింది. ఇది చూసిన నెటిజన్లు... కామెంట్ బాక్స్ లో హార్ట్ లను వర్షం కురిపిస్తున్నారు. సో క్యూట్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఇక సీతారామం



సినిమాలో మృణాల్ను చూసిన ప్రేక్షకులు... కలల రాణిగా సీతగా మృణాల్ ను పిలుచుకుంటున్నారు. తొలి సినిమాతోనే సౌత్ ఆడియన్స్ను ఫిదా చేసిన ఈ నార్త్ బ్యూటీ... ట్రెండీ లుక్ లోనే కాదు.. చీరలోనూ అదరగొడుతోంది. ఇక మృణాల్ ఠాకుర్ దుల్కర్ సల్మాన్ కలిసి నటించిన సీతారామం.. తెలుగు తమిళ్ లోనే కాదు.. హిందీలోనూ భారీ కలెక్షన్స్ రాబట్టాయి. హను రాఘవపూడి తెరకెక్కించిన ఈ సినిమాను అశ్వినీ దత్ నిర్మించారు. ప్రస్తుతం నానితో ఓ సినిమా చేయనుంది. నాని తన 30వ చిత్ర అప్డేట్ ను ఇటీవల ప్రకటించాడు. వైర ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై నిర్మాతలు మోహన్ చేరుకూరి డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ సినిమాలో మృణాల్ నటిస్తోంది. నూతన దర్శకుడు శౌర్యువ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నాడు. మలయాళ సినిమా హృదయం లాంటి సూపర్ హిట్కు సంగీతాన్ని సమకూర్చిన హేషమ్ అబ్దుల్ వహాబ్ మ్యూజిక్ అందిస్తున్నారు చూడాలి ఈ జోడి ప్రేక్షకులను ఎలా మెస్మరైజ్ చేయనుందో.




# రాజా డీలక్స్ లో నటిస్తున్నట్లుగా చెప్పకనే చెప్పేసింది





ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా గురించి ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటన రాలేదు. ఆ సినిమా షూటింగ్ విషయంలో అనేక రకాల పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఆ మధ్య ఒక షెడ్యూల్ పూర్తి అయ్యింది. మరో షెడ్యూల్ కు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో ఈ సినిమా రూపొందుతున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమా లో ప్రభాస్ కు జోడీగా ముగ్గురు ముద్దుగుమ్మలు నటించబోతున్నారని చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. ముగ్గురు ముద్దుగుమ్మల్లో మాస్టర్ బ్యూటీ మాళవిక మోహనన్ ఒకరు అని కూడా ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లు కూడా సినిమా గురించే అఫిషియల్ గా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఇక హీరోయిన్ విషయం క్లారిటీ లేనేలేదు. తాజాగా మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది. ఆ సందర్భంగా తెలుగు సినిమా గురించి స్పందించింది.

మాళవిక మోహనన్ ఒక అభిమాని తెలుగు సినిమా ఎంట్రీ ఎప్పుడు అంటూ ప్రశ్నించగా ఆమె స్పందిస్తూ.. తెలుగు సినిమాకు సంబంధించిన వర్క్ జరుగుతోంది. తప్పకుండా త్వరలోనే ఆ సినిమాను గురించి అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి అన్నట్లుగా చెప్పుకొచ్చింది. ఈ అమ్మడు ప్రభాస్ సినిమాలో కాకుండా మరే సినిమాలో నటిస్తున్నట్లుగా వార్తలు రాలేదు. కనుక తాను తెలుగు సినిమాలో నటిస్తున్నాను అంటూ చెప్పింది కనుక అది ప్రభాస్.. మారుతి సినిమా అయ్యి ఉంటుంది అంటూ చాలా మంది భావిస్తున్నారు. రాజా డీలక్స్ టైటిల్ ను పరిశీలిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ అధికారికంగా రాలేదు.

# మెన్ మాస్ సెలూన్ లో డర్టీ బ్యూటీ హాట్ అందాలు





డర్టీ హరి సినిమా లో హీరోయిన్ గా నటించి మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రుహాని శర్మ. ఈ అమ్మడు మెల్ల మెల్లగా ఇండస్ట్రీలో పాతుకు పోయేందుకు ప్రయత్నాలు చేస్తోంది. డర్టీ హరి సినిమా మొత్తం చాలా డర్టీ గా అనిపించినా కూడా రుహాని శర్మ పాత్ర మరియు ఆమె లుక్ మాత్రం చాలా డీసెంట్ గా ఉంటుంది. అందుకే రుహాని ప్రేక్షకులకు నచ్చింది. అంతకు ముందు మరియు ఆ తర్వాత కూడా రుహాని ఒక మోస్తరు స్కిన్ షో చేస్తూ సినిమాల్లో నటించింది.. నటిస్తూనే ఉంది. రుహాని యొక్క స్కిన్ షో చేయాలని ఏ ఫిల్మ్ మేకర్ కూడా భావించలేదు. అంతే కాకుండా ఆమె అందాలను చూపించి ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాలని కూడా ఫిల్మ్ మేకర్స్ భావించడం లేదు. హీరోయిన్ గా ఈ అమ్మడు ఇక నుండి స్కిన్ షో చేసేందుకు.. బికినీ ట్రీట్ చేసేందుకు సిద్ధం అన్నట్లుగా ఈ ఫొటోలతో చెప్పకనే చెబుతోంది. ఈ అందాల ముద్దుగుమ్మ రుహాని శర్మ యొక్క అందాల ఆరబోత సోషల్ మీడియాలో హీట్ పెంచుతోంది. మరోసారి ఈ అమ్మడి ఫొటోలు వైరల్ అయ్యాయి. ఒక మెన్ మాస్ సెలూన్ లో ఈ అమ్మడు ఫొటో షూట్ తో నెటిజన్స్ ను రెచ్చగొడుతుంది. అందాల ఆరబోత విషయంలో ఎంతో మంది స్టార్స్ ఈమె ముందు దిగదుడుపే అన్నట్లుగా క్లీ వేజ్ షో చేసి మతులు పోగొడుతోంది. నడుము అందం చూపిస్తూ డీ క్లీ వేజ్ షో చేసిన ఈ అమ్మడి యొక్క అందాల విందు ఎప్పుడు వెండి తెరపై చూస్తామో అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మీట్ క్యూట్ తో గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడు ప్రస్తుతం తెలుగు లో ఒక ప్రాజెక్ట్ ను చేస్తోంది.

ఇదే సమయంలో హిందీ లో ఆగ్ర అనే సినిమా తో ఎంట్రీ ఇవ్వబోతుంది. సౌత్ తో పాటు నార్త్ లో కూడా ఈ అమ్మడు కచ్చితంగా సందడి చేయడం పక్కా అంటూ ఈ ఫొటోలను చూస్తూ ఉంటే అనిపిస్తుంది.

# నడుము అందాలతో మతిపోగొట్టేసిన పార్వతి నాయర్

పార్వతి నాయర్ గురించి టాలీవుడ్ ప్రేక్షకులకి పెద్దగా తెలియకపోవచ్చు కాని మలయాళం తమిళ్ చిత్రాలు చూసే వారికి మాత్రం ఆమె సుపరిచితమే అని చెప్పాలి. ఇక సినిమాల కంటే ఆ మధ్య తన ఇంట్లో పనిచేసే వ్యక్తిపై వేధింపుల ఘటనతో వార్తల్లోకి ఎక్కింది. అయితే అంతకంటే ముందుగా ఈ అమ్మడుకి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. దీనికి కారణం రెగ్యులర్ గా ఈ బ్యూటీ పెట్టె అందాల ఫోటోలే కారణం. అందాల ప్రదర్శనలో ఎలాంటి హద్దులు పెట్టుకోకుండా సోషల్ మీడియాలో హాట్ ఫోటోలతో పార్వతి నాయర్ సందడి చేస్తూ ఉంటుంది. ఆమె సినిమాలలో చేసే గ్లామర్ రోల్స్ కంటే సోషల్ మీడియాలో గ్లామర్ షో పీక్ లో ఉంటుందని చెప్పాలి. 2014లో ఈ బ్యూటీ మలయాళీ చిత్రంతో కెరియర్ స్టార్ట్ చేసింది. స్టార్ హీరోయిన్ రేంజ్ గుర్తింపు లేకపోయిన



నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకుంది. ఇక పార్వతి నాయర్ బ్రదర్ ఇండియన్ క్రికెటర్ గా ఐపీఎల్ లో రాణిస్తున్నాడు. అతని పేరు శంకర్. ఈ విషయం చాలా మందికి తెలియదు. ఇదిలా ఉంటే ఆమె చివరిగా 83 అనే హిందీ సినిమాలో నటించింది. ఇదిలా ఉంటే ఈ తాజాగా ఈ బ్యూటీ ఇన్స్టాగ్రామ్ లో వైట్ కలర్ బ్లౌజ్ జీన్ ఫ్యాంట్ తో నడుము అందాలు కనిపించే విధంగా దిగిన ఫోటోలని ఇన్స్టాలో షేర్ చేసింది. ఇవి షేర్ చేసిన వెంటనే వైరల్ కావడం విశేషం. ఈ లుక్ లో పార్వతి నాయర్ బోల్డ్ అండ్ హాట్ గా కనిపిస్తుందని ఆమె అభిమానులు కామెంట్స్ చేయడం విశేషం. వైట్ బ్లౌజ్ లో క్లీవేజ్ షో తో సంనాన్ని నడుము ఒంపులు చూపిస్తూ కుర్రాళ్ళకి తన అందంతో పార్వతి మతి పోగొడుతుంది అని చెప్పాలి. ఈ ఫోటోలు చూసిన వారి మరింత హాట్ అండ్ నావెల్ ఫోటోలు షేర్ చేయాలని కామెంట్స్ చేస్తున్నారు. కొంత మంది ఈ లుక్ లో చాలా హాట్ గా ఉన్నావంటూ పొగడ్తలు కురిపిస్తున్నారు.

# హిట్ బ్యూటీ థైస్ చూపిస్తూ వయ్యారాల ఒలకబోత

2018 ఫెమినా మిస్ ఇండియాగా నిలిచిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి హీరోయిన్ గా తెలుగు సినిమాల్లో 2021 లో ఎంట్రీ ఇచ్చింది. ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే సినిమా తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ముద్దుగుమ్మ వరుసగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. గత ఏడాదిలో అడవి శేష్ హీరోగా నటించిన సూపర్ హిట్ మూవీ 'హిట్ 2' లో నటించి మెప్పించిన విషయం తెల్సిందే. అడవి శేష్ తో రొమాంటిక్ సన్నివేశాల్లో అలరించిన ఈ అమ్మడు మరిన్ని రొమాంటిక్ పాత్రల్లో ఆసక్తిగా ఉన్నట్లుగా ఈ ఫోటో షూట్స్ ను చూస్తూ ఉంటే అర్థం అవుతోంది.

హీరోయిన్ గా ఈ అమ్మడు ప్రస్తుతం తెలుగు తో పాటు ఇతర భాషల్లో కూడా నటించేందుకు ఆసక్తి చూపిస్తోంది. ఇదే



సమయంలో అందరిని అలరించేందుకు తన హాట్ ఫొటోలను సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్ గా షేర్ చేస్తూనే ఉంది. తాజాగా ఈ ఫొటోలతో అలరించింది. థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ వయ్యారంగా కెమెరాకు ఫోజ్ ఇచ్చిన ఈ అమ్మడి యొక్క అందాన్ని చూస్తూ అలాగే ఉండి పోవాలి అనిపిస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి.

ఇలాంటి అందగత్తె కు టాలీవుడ్ లో స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇంకొక్క హిట్ టాలీవుడ్ లో పడితే ఈ అమ్మడు వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి.



భద్రాద్రి రామయ్య దేవస్థానంలో జరుగుతోన్న పుష్కర మహా పట్టాభిషేకం మహోత్సవంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

# భద్రాచలంలో వైభవంగా సీతారాముల పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం



భద్రాచలం: భద్రాచలంలో సీతారాముల వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామ పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం జరుగుతున్నది. మిథిలా స్టేడియంలో పట్టాభిషేక కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలవరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. పట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. సీతారాములకు గవర్నర్ తమిళిసై పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు భారీగా తరలిరావడంతో మిథిలా ప్రాంగణం నిండిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, రామచంద్రుడికి మినహా మరే ఇతర దైవ స్వరూపానికి పట్టాభిషేక వేడుక నిర్వహించరు. ప్రతి పుష్కరానికి అంటే పన్నెండేండ్లకొకసారి శ్రీరామ సామ్రాజ్య పుష్కర పట్టాభిషేకాన్ని, 60 ఏండ్లకొకసారి ప్రభవనామ సంవత్సరంలో శ్రీరామ మహా సామ్రాజ్య వైభవ పట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు. 1999లో శ్రీరామునికి ప్రథమ పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకాన్ని, 2011లో రెండో పుష్కర పట్టాభిషేకాన్ని నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్నది మూడోది.

# సమర్థమైన నాయకత్వం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : గ్రామంలో సర్పంచ్ నుంచి రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి వరకు సమర్థమైన నాయకత్వం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయకపోతే అభివృద్ధి జరగదని తేల్చిచెప్పారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులను అందించిన సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఏడాదిన్నర పాటు పని చేశాను అని కేటీఆర్ తెలిపారు. గ్రామీణ నేపథ్యం గురించి తనకు చాలా తక్కువ తెలుసు. పల్లెలకు ఏం కావాలి. పల్లెల్లో ఏ అవసరాలు ఉన్నాయో ముఖ్యమంత్రికి బాగా తెలుసు. సర్పంచ్ కంటే ఎక్కువగా కేసీఆర్ ఆలోచిస్తారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన నాయకుడు కాబట్టి.. పల్లెలను అభివృద్ధి చేస్తున్నారు. పల్లెకు, పల్లె ప్రజలకు ఏం కావాలో కేసీఆర్‌కు తెలిసినంతగా దేశంలో ఏ నాయకుడికి తెలియదు. కేసీఆర్ తొలిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఎన్ఐఆర్‌డీలో శిక్షణకు హాజరయ్యారు. రాష్ట్రంలోని అన్ని స్థాయిల్లో ప్రజాప్రతినిధులు ఏం విధులు నిర్వహించాలో అధ్యయనం చేశారు. తొలిసారి గెలిచిన ప్రజాప్రతినిధులకు తమ విధులపై పూర్తి అవగాహన ఉండట్లేదు. మన దేశంలో ప్రభుత్వ వ్యవస్థ ఐదు అంచెలుగా ఉంది. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయకపోతే అభివృద్ధి జరగదు. ఎంపీటీసీలు గ్రామాలకు మండలానికి మధ్య సమన్వయకర్తగా ఉండాలి. జడ్పీటీసీలు మండలానికి, జిల్లా పరిషత్‌కు మధ్య సమన్వయకర్తగా ఉండాలి. ఐదంచెల వ్యవస్థలో ఎవరి పాత్ర ఏంటని తెలుసుకోనంత కాలం.. ప్రజాప్రతినిధులైనా, వ్యవస్థ అయినా ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలవాలనే ఆరాటంతో అనేక హామీలు ఇస్తాం. ఆ హామీలను నెరవేర్చాల్సిన అవసరం ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. పంచాయతీ సెక్రటరీ పోస్టు ఖాళీ అయితే తక్షణమే భర్తీ చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన అధికారులు రాష్ట్రంలో పని చేస్తున్నారు. తెలంగాణలో గ్రామాలు ఎలా ఉన్నాయి. వారి సొంత రాష్ట్రాల్లో గ్రామాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకోండి.

మాటలు మాట్లాడితే సరిపోదు. ప్రజల వద్దకు పాలన తీసుకుపోవాలనే సంకల్పం ఉండాలి. రాష్ట్ర ఏర్పాటుతోనే వికేంద్రీకరణ ఆగలేదు. అంతటితో ఆగకుండా 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చుకున్నాం. 142 మున్సిపాలిటీలు ఉన్నాయి. 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దీంతో సూక్ష్మంగా పని చేసేందుకు వీలు కలిగింది. వికేంద్రీకరణ వల్ల వేగంగా పనులు జరుగుతాయి. ఇప్పటి వరకు 79 జాతీయ అవార్డులు గెలుచుకున్నాం. గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# తెలంగాణలో కాంగ్రెస్‌కు పట్టిన గతే బీజేపీకి : మంత్రి హరీశ్‌రావు



మెదక్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే బీజేపీకి కూడా పడుతుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. నాడు కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణకు ఏమి ఇవ్వము అని చెబితే, తెలంగాణ కాంగ్రెస్ నేతలు నోరు మెదపలేదు. ఒక్క రూపాయి కూడా ఇవ్వం ఏం చేసుకుంటావో చేస్కో అని అన్నారు కిరణ్ కుమార్ రెడ్డి. ప్రజల దెబ్బకు కాంగ్రెస్ పార్టీ డిపాజిట్లు గల్లంతు అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ ఖతం అయ్యింది. ఇప్పుడు కేంద్రం కూడా అలాగే చేస్తుంది. మెడికల్ కాలేజీలు, నవోదయ విద్యాలయాలు, నర్సింగ్ కాలేజీలు, కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వలేదు. ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదు. కాబట్టి కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే బీజేపీకి కూడా పడుతుందన్నారు హరీశ్‌రావు. మెదక్ జిల్లా శివ్వంపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. తొమ్మిదేండ్ల క్రితం తెలంగాణ ఎలా ఉండే..? ఇప్పుడు ఎలా ఉందో..? అనే విషయాన్ని గుండె మీద చేయి వేసి ఆలోచించాలన్నారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ వంటి పథకాలు గతంలో ఉండేనా అని ప్రశ్నించారు. నాడు అన్నదాత ఏడుపు.. ఆకలి కేకలు వినిపించేవి. ఇప్పుడు అవి లేకుండా చేశామన్నారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ పార్టీలు చేయని పనులు గులాబీ జెండా చేసిందని స్పష్టం చేశారు. నెత్తి లేనోడు, కత్తి లేనోడు నత్తి నత్తిగా మాట్లాడుతాడు అని విపక్షాలపై హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మేనిఫెస్టోలో లేని పథకాలు అనేకం అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాల కోసం పని చేస్తున్నామని స్పష్టం చేశారు. అదానీ ఆస్తిని బీజేపీ పెంచితే, ప్రజల ఆస్తిని కేసీఆర్ పెంచారని గుర్తు చేశారు. పెంచుడు బీజేపీ వంతు అయితే.. పంచుడు కేసీఆర్ వంతు అని పేర్కొన్నారు.

కేసీఆర్ రాష్ట్ర సంపద పెంచి పేదలకు పంచాడని తెలిపారు. బీజేపీ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. హక్కుగా రావాల్సినవి కూడా ఇవ్వడం లేదని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# టీఎస్‌పీఎస్సీ ముట్టడికి యత్నం.. షర్మిల అరెస్ట్



హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ముట్టడికి యత్నించిన వైతెపా అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు అరెస్ట్ చేశారు. పేపర్ లీకేజీపై సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తూ వైతెపా శ్రేణులు ఆందోళనకు దిగాయి. ఈ క్రమంలో షర్మిలతో పాటు ఆ పార్టీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. అంతకుముందు షర్మిల మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంలో పెద్ద వ్యక్తులను తప్పించే ప్రయత్నం జరుగుతోందని.. చిన్నవాళ్లను దోషులుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. “టీఎస్‌పీఎస్సీ ముందు ఆందోళన అంటే హౌస్ అరెస్ట్ చేస్తున్నారు. బయటకు వెళ్లాలి అంటే ఇతర కారణాలు చూపించి నన్ను నిర్బంధిస్తున్నారు. నా ఇంటి చుట్టూ వందలాది మంది పోలీసులను మోహరించారు. నాకు లుక్ అవుట్ నోటీసులు ఇచ్చారు.. లుక్ అవుట్ ఆర్డర్ ఇవ్వడానికి నేనేమైనా క్రిమినల్‌నా?” అని షర్మిల ప్రశ్నించారు.

# టోల్ బాదుడు షురూ.. సగటున 4 నుంచి 4.5 శాతం పెంపుదల

హైదరాబాద్: దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై ప్రయాణం మరింత భారం కానున్నది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి టోల్‌ట్యాక్సులు పెంచేందుకు జాతీయ రహదారుల అథారిటీ రంగం సిద్ధం చేసింది. ప్రస్తుత ట్యాక్స్‌పై పెంపుదల సగటున 4 నుంచి 4.5 శాతం వరకు ఉండనుంది. దీంతో సాధారణ ప్రజల రవాణా సాధనమైన బస్సు ప్రయాణం మరింత భారం కానున్నది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలతో ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు టోల్ ఫీజులతో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రజల సగటు జీవనం భారంగా మరనుంది. జాతీయ రహదారుల ఫీజు (డిటర్మినేషన్ ఆఫ్ రేట్స్ అండ్ కలక్షన్) నిబంధనలు-2008 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఏటా టోల్‌ట్యాక్సుల సవరణ చేపడుతున్నది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం కూడా పెరిగిన టోల్ ట్యాక్స్ శనివారం నుంచి (ఏప్రిల్ 1) అమల్లోకి రానుంది.

**ప్రతి కిలోమీటర్‌పై రూ.3 పెంపు :** గతేడాది నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) వివిధ రకాల వాహనాలకు 10-15 శాతం వరకు టోల్‌ట్యాక్స్‌ను పెంచింది. ప్రస్తుతం జాతీ య రహదారులపై ప్రతి కిలోమీటర్‌కు అది రూ. 2.19గా ఉన్నది. తాజాగా మళ్లీ పెంచడంతో ప్రతి కిలోమీటరుకు రెండున్నర నుంచి 3 రూపాయల భారం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఉదాహరణకు ప్రస్తుతం హైదరాబాద్ నుంచి నాగపూర్ వరకు రూ.1000 వరకూ టోల్ ట్యాక్స్ వసూలు చేస్తుండగా, పెంపు తరువాత ఇది రూ.1100-1200 వరకు ఉండే అవకాశముందన్నారు. రాష్ట్రం పరిధిలో వివిధ మార్గాల్లో జాతీయ రహదారులపై 32 టోల్‌గేట్లు ఉండగా, వాటిపై ప్రస్తుతం రూ.1800 కోట్లకుపైగా టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం గడచిన తొమ్మిదేండ్లలో కేంద్రం టోల్‌చార్జీలను 300 శాతం పెంచడం గమనార్హం. టోల్‌ట్యాక్స్‌లను ఏటా 5 నుంచి 10 శాతం వరకు పెంచుతుండటంతో నిత్యావసర వస్తువుల భారం ఏటేటా పెరుగుతున్నది.

**నెలవారీ పాస్‌లపైనా మోత :** నెలవారీ పాసులకు పెంపుదల వర్తించనుంది. వీరికి కనిష్ఠంగా రూ.155 మొదలుకొని గరిష్ఠంగా రూ.1295 వరకు పెరుగనుంది. వీటి చార్జీలను ఐదు నుంచి ఆరు శాతం పెంచినట్లు స్పష్టమవుతున్నది. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై గరిష్ఠ టోల్ చార్జి ఉండే కొర్లపహాడ్ వద్ద నెలవారి పాసులపై అదనపు భారాన్ని పరిశీలిస్తే.. జీపు, వ్యాన్ లాంటి లైట్ మోటార్ వాహనాలకు ప్రస్తుతం రూ.4025 ఉంటే అది రూ. 4225కు పెరిగింది. లైట్ కమర్షియల్ వెహికిల్‌కు రూ.6385 నుంచి రూ.6710కు పెరిగింది. బస్ లేదా ట్రక్‌కు రూ.13240 నుంచి రూ.13910కు, హేవీ వెహికిల్స్‌కు రూ.20,530 నుంచి రూ.21,570వరకు, ఓవర్ సైజ్డ్ వెహికిల్స్‌కు రూ.25,545 నుంచి 26,840 రూపాయలకు నెలవారి పాసుల రుసుము పెరిగింది.




# రద్దీ సమయాల్లో రాయితీ ఎత్తివేత!

హైదరాబాద్: నగరవాసులకు హైదరాబాద్ మెట్రో రాయితీల్లో కోత విధించనుంది. ఏప్రిల్ 1 నుంచి మెట్రో రాయితీల్లో కోత విధించనున్నట్లు మెట్రో అధికారులు వెల్లడించారు. రద్దీ వేళల్లో డిస్కౌంట్‌ను పూర్తిగా ఎత్తివేయనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ... రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ మాత్రమే రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. మెట్రో కార్డు, క్యూఆర్ కోడ్‌పై ఇప్పటి వరకు ప్రయాణ ఛార్జీల్లో 10శాతం డిస్కౌంట్ ఉండేది. అదేవిధంగా సూపర్ సేవర్ హాలీడే కార్డ్ ఛార్జీని భారీగా పెంచనున్నట్లు మెట్రో అధికారులు ప్రకటించారు. సెలవు రోజుల్లో ప్రయాణించే హాలీడే కార్డు రూ.59గా ఉన్న ధరను రూ.99కి పెంచనున్నారు. గతంలో రూ.59లతో కార్డు తీసుకున్న వారు... సూపర్ సేవర్ రూ.99 రీఛార్జ్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. కానీ, కొత్తగా తీసుకునే వారు మాత్రం రూ.100 చెల్లించాలని చెప్పారు. అలాగే కాంటాక్ట్ లెస్ స్మార్ట్ కార్డుల ధరను భారీగా పెంచనున్నారు.



# మోదీ డిగ్రీ పత్రాలు.. చూపించాల్సిన అవసరం లేదు

అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్హతల వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భంగపాటు ఎదురైంది. ఈ అంశంపై గుజరాత్ హైకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. ప్రధాని డిగ్రీ, పీజీ పత్రాలను పీఎంవో చూపించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఏడేళ్ల క్రితం కేంద్ర సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసిన న్యాయస్థానం.. కేజ్రీవాల్‌కు రూ.25వేల జరిమానా కూడా విధించింది. అసలేం జరిగిందంటే.. ప్రధాని మోదీ విద్యార్హతలపై ఆరోపణలు చేస్తున్న కేజ్రీవాల్.. ఆయన డిగ్రీ, పీజీ సర్టిఫికెట్ల కోసం 2016లో సహచట్టం ద్వారా కేంద్ర సమాచార కమిషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన సీఐసీ.. మోదీ డిగ్రీ, పీజీ పత్రాలను చూపించాలంటూ పీఎంవో కార్యాలయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీఐవో), గుజరాత్, ఢిల్లీ యూనివర్శిటీల పీఐవోలను 2016 ఏప్రిల్‌లో ఆదేశించింది. అయితే మూడు నెలల తర్వాత సీఐసీ ఆదేశాలను సవాల్ చేస్తూ గుజరాత్ యూనివర్శిటీ.. రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించింది. దీంతో సీఐసీ ఆదేశాలపై అప్పుడు హైకోర్టు స్టే విధించింది. ఇటీవల ఈ కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. దీనిపై హైకోర్టు గత నెల విచారణ జరిపింది. గుజరాత్ యూనివర్శిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. “మోదీ విద్యార్హతలను దాచిపెట్టాల్సిన అవసరం లేదు. ఆ వివరాలు ఇప్పటికే పబ్లిక్ డొమైన్‌లో, యూనివర్శిటీ వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రజాస్వామ్యంలో ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి డాక్టరేట్ అయినా.. నిరక్షరాస్యుడైనా పెద్ద భేదమేమీ ఉండదు. అంతేగాక.. ఈ వివరాలను ప్రత్యేకంగా బయటపెట్టడంలో ప్రజా ప్రయోజనమేం లేదు. ఇక ప్రధాని వ్యక్తిగత గోప్యతపై ఇది ప్రభావం చూపుతుంది. ఓ వ్యక్తి బాధ్యతారహితమైన అత్యుత్సాహానికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు” అని తుషార్ మెహతా వాదించారు. అయితే, ఈ వాదనలను కేజ్రీవాల్ తరఫు న్యాయవాది ఖండించారు. ఆ పత్రాలు ఇంటర్నెట్‌లో అందుబాటులో లేవని, ఆధారాల కోసమే వాటి కాపీలను అడుగుతున్నామని తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం నేడు కీలక తీర్పు వెలువరించింది. మోదీ సర్టిఫికెట్లను పీఎంవో గానీ.. యూనివర్శిటీ గానీ చూపించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. ఈ సందర్భంగా ఆ పత్రాలను కోరిన కేజ్రీవాల్‌కు రూ.25వేల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని నాలుగు వారాల్లోగా గుజరాత్ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీలో జమ చేయాలని ఆదేశించింది. ఈ తీర్పుపై స్టే ఇచ్చేందుకు కూడా కోర్టు నిరాకరించింది. కాగా.. ప్రధాని మోదీ 1978లో గుజరాత్ యూనివర్శిటీ నుంచి గ్రాడ్యుయేషన్, 1983లో ఢిల్లీ యూనివర్శిటీ నుంచి పీజీ పూర్తిచేశారు.



# ప్రాణం తీసిన మస్కిటో కాయిల్ – ఒకే కుటుంబంలో ఆరుగురి మృతి

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. దోమల నివారణకు వెలిగించిన మస్కిటో కాయిల్ ఆరుగుర్ని బలితీసుకుంది. ఆ కాయిల్ కారణంగా మంటలు చెలరేగి, ఆ తర్వాత వెలువడిన విషపూరిత వాయువులను పీల్చడంతో ఊపిరాడక ఒకే కుటుంబంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఏడాదిన్నర చిన్నారి కూడా ఉండటం మరింత విచారకరం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈశాన్య ఢిల్లీలోని శాస్త్రి పార్క్ ప్రాంతంలో ఓ కుటుంబం నివాసముంటోంది. గురువారం రాత్రి దోమలను తరిమేందుకు వీరు మస్కిటో కాయిల్‌ను అంటించి పడుకున్నారు. అయితే రాత్రి సమయంలో ఈ కాయిల్.. పరుపుపై పడి మెల్లిగా అంటుకుని పొగ అలుముకుంది. అటు కిటికీలు, తలుపులు కూడా పూర్తిగా మూసి ఉన్నాయి. పరిస్థితిని గమనించి వారు బయటపడేందుకు ప్రయత్నించినా విషపూరిత వాయువులను పీల్చి వారు స్పృహతప్పి పడిపోయారు. శుక్రవారం ఉదయం వారి ఇంటి నుంచి మంటలు రావడం గమనించి స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లారు. ప్రమాద సమయంలో ఇంట్లో మొత్తం 9 మంది ఉండగా.. వీరిలో ఆరుగురు విగతజీవులుగా కన్పించారు. మిగతా ముగ్గురిని పోలీసులు రక్షించి ఆసుపత్రికి తరలించారు. “రాత్రంతా విషవాయువులు పీల్చడంతో వారు స్పృహతప్పి పడిపోయారు. ఆ తర్వాత ఊపిరాడక ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు” అని స్థానిక పోలీసులు వెల్లడించారు. మృతుల్లో ఏడాదిన్నర వయసున్న చిన్నారి కూడా ఉంది.

# గొలుసుకట్టు సంస్థలకు ప్రచారం చేయొద్దు: అమితాబ్‌కు సజ్జనార్ విజ్ఞప్తి



హైదరాబాద్: గొలుసుకట్టు సంస్థలకు ప్రముఖులు ఎవరూ ప్రచారం చేయొద్దంటూ ట్విటర్ వేదికగా ఐపీఎస్ అధికారి, టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మరోసారి విజ్ఞప్తి చేశారు. తాజాగా ఓ సంస్థకు ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ ప్రచారం చేయడంపై ఆయన్ను ట్యాగ్ చేస్తూ సజ్జనార్ ట్వీట్ చేశారు. “గొలుసుకట్టు సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నాయి.

అమాయక ప్రజలను మోసం చేసి డబ్బు సంపాదిస్తున్నాయి. ఇలాంటి సంస్థలను సెలబ్రిటీలు ప్రమోట్ చేయడం కానీ.. వాటికి మద్దతు ఇవ్వడం కానీ చేయొద్దు” అని సజ్జనార్ సలహా ఇచ్చారు. గతంలో ఓ మల్టీ లెవెల్ మార్కెటింగ్ సంస్థకు టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా ప్రచారం చేయడంపై ఆయన ట్విటర్‌లో స్పందించిన విషయం తెలిసిందే. సజ్జనార్ హైదరాబాద్ సీపీగా ఉన్న సమయంలో పలు మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీలపై చర్యలు తీసుకున్నారు.

# ‘ఒవైసీ నా కొడుకులు, బామ్మర్దులు’ అంటూ చికోటి ప్రవీణ్ సంచలన వ్యాఖ్యలు



సంగారెడ్డి : క్యాసినో కింగ్ చికోటి ప్రవీణ్ కుమార్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇప్పటి వరకూ ఆయన కేసినో వ్యవహారంలో వార్తల్లో నిలువగా.. ఇప్పుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తలకెక్కారు. జహీరాబాద్‌లో రాముని శోభ యాత్రలో చికోటి ప్రవీణ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఒవైసీ ఒకప్పుడు చేసిన వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ ఇప్పుడు కౌంటర్ ఇచ్చారు. హిందూ ధర్మం గురించి మాట్లాడితే తలలు నరుకుతామన్నారు. క్యాసినో ఆడేటోడు హిందూ ధర్మం గురించి మాట్లాడవద్దా..? అని చికోటి ప్రవీణ్ ప్రశ్నించారు. హిందువులపై కేసులు పెడితే బెయిలు తీసుకువచ్చే బాధ్యత తనదేనంటూ భరోసా ఇచ్చారు. అసలు చికోటి ప్రవీణ్ ఏం మాట్లాడరనేది ఆయన వ్యాఖ్యల్లోనే.. “ఒవైసీ నా కొడుకులు, బామ్మర్దులు మాకు 15 నిమిషాలు పోలీసులు లేకుండా ఉంటే మెమెంటో చూపిస్తాం అన్నారు.

మీ అంతు చూడటానికి మాకు రెండే రెండు నిమిషాలు చాలు. మా హిందూ ధర్మం గురించి తప్పుగా మాట్లాడే కొడుకులవి తలలు నరుకుతం. అరేయ్ కొజ్జాల్లారా.. మత మార్పిడి కుక్కల్లారా.. మా జనాభా ఎక్కువగా ఉందని మీరు ఏడుస్తున్నారు... మీకు పెంచుకునే శక్తి లేదా..? మేము పెంచాలా? క్యాసినో ఆడేటోడు హిందూ ధర్మం గురించి మాట్లాడవద్దా..? హిందువులపై కేసులు పెడితే బెయిలు తీసుకువచ్చే బాధ్యత నాది” అని పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com